

ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వామపక్ష నాయకులు

అంగన్‌వాడీల తొలగింపు!

ప్రభుత్వ దుందుడుకు చర్య

- సమ్మెలో ఉన్న సిబ్బందిని తొలగిస్తూ ఉత్తర్వులు
- జిల్లాలో 696 మంది వర్కర్లు, 647 మంది ఆయాలపై యాక్షన్
- ఆ ఉత్తర్వులను సిబ్బందికి అందించే బాధ్యత రెవెన్యూకు అప్పగింత
- యథావిధిగా సమ్మె: అంగన్‌వాడీల స్పష్టీకరణ
- ప్రభుత్వాన్ని మేమే టెర్మినేట్ చేస్తున్నామంటూ ప్రకటన

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):


డిమాండ్ల సాధన కోసం ఆరు వారాల నుంచి నిరవధికంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం చర్యలకు దిగింది. గడువులోగా విధుల్లో చేరలేదంటూ జిల్లాలో దాదాపు 1,343 మంది వర్కర్లు, ఆయాలపై వేటు వేసింది. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ సమ్మె కొనసాగిస్తున్న సిబ్బందిని విధుల నుంచి తొలగించాలంటూ వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు సోమవారం తొలగింపు ఉత్తర్వులను జారీచేశారు.

జిల్లావ్యాప్తంగా 776 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 765 మంది వర్కర్లు, 697 మంది ఆయాలు పనిచేస్తున్నారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని కోరుతూ సిబ్బంది గత నెల 12 నుంచి సమ్మె చేపట్టారు. ప్రభుత్వం నుంచి ఎన్ని రకాలుగా ఒత్తిళ్లు వచ్చినప్పటికీ వెనక్కి తగ్గలేదు. దీంతో కొద్దిరోజుల కిందట ఉద్యోగులకు ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారు. బెదిరింపులు, ఒత్తిళ్ల పెరగడంతో జిల్లాలో కొన్నిచోట్ల సిబ్బంది, ఆయాలు విధుల్లో చేరారు. మిగిలిన వారంతా యథావిధిగానే సమ్మెను కొనసాగిస్తున్నారు. సమ్మెలో భాగంగా సోమవారం 'చలో విజయవాడ'కు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. అక్కడకు ... మిగతా 6వ పేజీలో

ఫ్లాష్.. ఫ్లాష్...

అంగన్‌వాడీల సమ్మె విరమణ : మంత్రి బొత్స

అంగన్‌వాడీలు సమ్మె విరమించి మంగళవారం నుంచి విధులకు హాజరవుతారని మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం అర్ధరాత్రి 12 గంటల తరువాత ప్రకటించారు. అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ సంఘం నేతలతో రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం అయినట్టు ఆయన పేర్కొన్నారు.



జగదాంబ సెంటర్‌లోని అంబికాబాగ్‌లో సీతారాములు

అంతా రామమయం

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):


నగరంలో ఎటు చూసినా సోమవారం రామ నామ జపమే కనిపించింది. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ జరిగిన నేపథ్యంలో ఇక్కడ కూడా శ్రీరాముడికి పూజలు చేసి భక్తిని చాటుకున్నారు. జగదాంబ సెంటర్‌లోని అంబికాబాగ్‌లో సీతారాములను శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి దర్శించుకుని పూజలు చేశారు. బీచ్‌రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో, ఆనందపురం సమీపానున్న గంభీరంలోని ఇస్కాన్ ఆలయంలో అక్షయ పాత్ర ఫౌండేషన్‌లో పూజలు నిర్వహించారు. ఇసుకతోటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో బీజేపీ నాయకులు రామ వ్రతం నిర్వహించారు. చాలా మంది ఇళ్లల్లో టీవీల ముందు కూర్చొని అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వీక్షించారు.



స్వామి వారికి నమస్కరిస్తున్న భక్తులు

19,42,593

ఇదీ జిల్లాలో ఓటర్ల సంఖ్య



- తుది జాబితా విడుదల
- పురుషులు 9,60,101, మహిళలు 9,82,380, ట్రాన్స్‌జండర్లు 112 మంది
- ముసాయిదా జాబితాతో పోల్చితే 26,911 ఓట్లు పెరుగుదల
- భీమిలి, విశాఖ తూర్పు, ఉత్తరం, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో పెరిగిన ఓటర్లు
- విశాఖ దక్షిణ, పశ్చిమలో తగ్గుదల
- గత జనవరితో పోల్చితే 46,550 మంది, 2019తో పోల్చితే 60,919 మంది ఓటర్లు పెరుగుదల
- అప్పుడు గాజువాకలో అత్యధికం, ఇప్పుడు భీమిలిలో..

జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జండర్లు	మొత్తం
భీమిలి	1,72,488	1,78,957	17	3,51,462
విశాఖ తూర్పు	1,35,516	1,40,990	17	2,76,523
దక్షిణ నియోజకవర్గం	1,03,334	1,06,764	33	2,10,131
ఉత్తరం	1,35,664	1,39,078	18	2,74,760
పశ్చిమ	1,02,089	1,04,844	10	2,06,943
గాజువాక	1,62,434	1,61,225	12	3,23,671
పెందుర్తి	1,48,576	1,50,522	05	2,99,103
మొత్తం	9,60,101	9,82,380	112	19,42,592

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):

జిల్లా తుది ఓటర్ల జాబితా సోమవారం విడుదల చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి 19,42,593 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 9,60,101, మహిళలు 9,82,380, ట్రాన్స్‌జండర్లు 112 మంది. గత ఏడాది అక్టోబరు 27న విడుదల చేసిన ముసాయిదా జాబితా (19,15,682)తో పోల్చితే 26,911 మంది ఓటర్లు పెరిగారు.

జిల్లాలోని భీమిలి నియోజకవర్గంలో అత్యధికంగా 3,51,462 మంది ఓటర్లు ఉండగా, అతి తక్కువగా విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 2,06,943 మంది ఓటర్లు ఉన్నారు. కాగా పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 22,279 మంది ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా పెందుర్తిలో ఓటర్లు పెరిగితే, విశాఖ పశ్చిమలో భారీగా తగ్గారు. భీమిలిలో 11,553 మంది, విశాఖ తూర్పులో 11,250 మంది, విశాఖ ఉత్తరంలో 3,023 మంది, గాజువాకలో 10,862, పెందుర్తిలో 11,619 మంది ఓటర్లు పెరిగారు. ఇక విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 6,999 మంది, విశాఖ పశ్చిమలో 14,397 మంది ఓటర్లు తగ్గారు.

గత ఏడాది విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 19,15,682 మంది ఓటర్లు ఉన్నారు. ముసాయిదా జాబితా విడుదల తరువాత కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారు/శాశ్వతంగా వలస వెళ్లేవారి ఓట్లు తొలగింపు, ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్తగా ఓటు నమోదు కోసం 1,64,048 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన 1,37,137 ఓట్లు తొలగించారు. చివరకు తుది జాబితాలో 19,42,593 ఓటర్లు నమోదయ్యారు.

గత ఏడాదితో పోల్చితే 46,550 ఓట్లు పెరిగారు

జిల్లాలోని రెండు (భీమిలి, గాజువాక) నియోజకవర్గాల్లో మూడు లక్షలకు పైబడి ఓటర్లు ఉన్నారు. పెందుర్తిలో మూడు లక్షలకు అతి చేరువ (2,99,103)లో ఉన్నారు. గత ఏడాది జనవరి ఐదో తేదీన విడుదల చేసిన జాబితాలో 18,96,043 మంది ఓటర్లు ఉండగా..సోమవారం నాటి జాబితాలో 19,42,593 మంది ఉన్నారు. ఏడాదిలో సుమారు 46,550 మంది ఓటర్లు పెరిగారు. ఓటర్లు పెరిగినా పోలింగ్ బూత్‌ల సంఖ్య 1945 నుంచి 1941కు తగ్గడం గమనార్హం.

భీమిలిలో గత ఏడాది జనవరి నాటికి 3,27,616 ఓటర్లు ఉండగా...తాజా జాబితాలో 3,51,462కు పెరిగారు. విశాఖ తూర్పులో 2,56,696 మంది ఉంటే ప్రస్తుత జాబితాలో 2,76,523, గాజువాకలో 3,10,538 నుంచి 3,23,671కు, పెందుర్తిలో 2,78,277 నుంచి 2,99,103కు పెరిగారు. అదే ... మిగతా 6వ పేజీలో

నగరానికి షర్మిల

- రాహుల్ పాదయాత్రపై దాడిని ఖండిస్తూ గాంధీ విగ్రహం వద్ద నిరసన

రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రపై అసోంలో బీజేపీ నాయకులు దాడికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం రాత్రి విశాఖలో నిరసన చేపట్టారు. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి నగరానికి వచ్చిన ఆమె ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. తొలుత గాంధీ విగ్రహానికి పూల దండ వేసి నివాళులర్పించిన అనంతరం ఆమె...పార్టీ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ... వివరాలు మెయిన్‌లో



జీవీఎంసీలో భారీగా బదిలీలు?

- మూడేళ్లకుపైబడి ఉన్నవారికి స్థాన చలనం
- ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రభావం

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పలువురు అధికారుల బదిలీకి రంగం సిద్ధమైంది. ఒకేచోట మూడేళ్లకుపైగా పనిచేస్తున్న వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేయాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. జీవీఎంసీ జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, జోన్-5 కమిషనర్ ఆర్‌వీఎస్ కృష్ణ మినహా మిగిలిన ఆరుగురు జోనల్ కమిషనర్లు మూడేళ్లకు మించి జీవీఎంసీలో పనిచేస్తున్నారు. ఇప్పుడు వారంతా బదిలీ కావాల్సి ఉంటుంది. అలాగే టౌన్‌ప్లానింగ్ విభాగంలో సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న దొరతోపాటు ఇద్దరు డీసీపీలు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరు సూపరింటెండెంట్ ఇంజనీర్లకు కూడా బదిలీ కావాల్సి ఉంటుంది. యూసీడీ విభాగంలో డీపీఓలుగా పనిచేస్తున్న ఇద్దరు అధికారులు కూడా మూడేళ్లకుపైగా పనిచేస్తుండడంతో వారికి కూడా బదిలీ తప్పదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. బదిలీలపై ఇప్పటికే కసరత్తు పూర్తయిందని, ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం రేపు

- 33 అంశాలతో ఎజెండా -వార్త 6వ పేజీలో..

నో టెండర్

- వైశాఖి జల ఉద్యానవనం స్థానంలో అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్ అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ ప్లాన్
- ఆసక్తి చూపని సంస్థలు
- రెండోసారి నోటిఫికేషన్ ఇచ్చిన నగర ప్రాంత అభివృద్ధి సంస్థ



వైశాఖి జల ఉద్యానవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర నడిబొడ్డునున్న ప్రాంతంలో 3.48 ఎకరాల వైశాఖి జల ఉద్యానవనం స్థలాన్ని అభివృద్ధి చేయడానికి విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) టెండర్లు ఆహ్వానిస్తే ఒక్కరంటే ఒక్కరు కూడా ముందుకురాలేదు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం పక్కనే వైశాఖి జల ఉద్యానవనం ఉంది. దీనిని పూర్తిగా కూలగొట్టి 'అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్'గా మార్చాలని నిర్ణయించారు. అన్ని వయసుల వారిని అలరించే అంశాలు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. మధ్యలో ఆధునిక వినోదాలతో కూడా గేమింగ్ జోన్, 7డి నుంచి 12డి వరకు యానిమేషన్, అక్వేరియం వాల్‌కు రూపకల్పన చేశారు. చుట్టూ డ్రైవ్ ఇన్ ఫుడ్ జోన్ ఉండాలని నిర్ణయించారు. ఇక్కడ అన్నిరకాల ఆహారం, 24/7 లభించేలా ఉండాలనుకున్నారు. కాసేపు సేదతీరాలని, వినోదం కావాలనుకునే వచ్చేవారికి అన్ని రకాల వసతులు, ఏర్పాట్లు ఉండాలనేది ఆలోచన. ఈ ప్రాజెక్టును ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో చేయాలని, 33 ఏళ్లకు స్థలాన్ని లీజుకు ఇస్తామని వీఎంఆర్‌డీఏ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుపై ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ (ఆదాయం) 15 శాతం వరకు వస్తుందని కన్సల్టెంట్లు అంచనాలు వేశారు. అయితే రాష్ట్రంలో ఏ ఒక్కరూ ముందుకు రాలేదు.

కారణాలు ఏమిటంటే..?

భూమిని లీజుకు తీసుకొని, ప్రాజెక్టు చేపట్టేవారు ఆ భూమి సబ్ రిజిస్ట్రార్ (ఎస్ఆర్) విలువలో ఒక శాతం ప్రతి నెల అద్దెగా చెల్లించాలి. అక్కడ 3.48 ఎకరాల భూమి అంటే 16,843 గజాలు అందుబాటులో ఉంది. ఆ ఏరియాలో ఎస్.ఆర్. విలువ గజం రూ.50 వేలు. ఆ లెక్కన భూమి విలువ రూ.84.21 కోట్లు. అందులో ఒక శాతం అంటే రూ.84.21 లక్షలు (జీఎస్‌టీతో కలుపుకొని సుమారు కోటి రూపాయలు) ప్రతి నెలా అద్దెగా ఇవ్వాలి. ఇది కాకుండా వచ్చే స్థూల ఆదాయంలో ... మిగతా 6వ పేజీలో


జ్ఞానాపురంలో నిర్వహించిన పూజల్లో జనసేన నేత కందుల నాగరాజు


మాధవధారలో చేపట్టిన శోభాయాత్రలో విష్ణుకుమార్ రాజు


సీతంపేటలో కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న సీతారాముల కళ్యాణం

మార్మోగిన శ్రీరామ నామస్మరణ

- అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని సందడి
- శోభాయాత్రలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సీతమ్మధార, జనవరి 22: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సీతమ్మధార గాంధీనగర్ అభయ అంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరాముడు, ఆంజనేయస్వామి చిత్రాలనువేసి భక్తులు చుట్టు దీపాలు వెలిగించారు. సీతంపేటలో మూడుగుళ్లపక్కనున్న కళ్యాణ మండపంలో షిర్డీ సాయిబాబా భజన మండల సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కళ్యాణం, పట్టాభిషేక మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సీతమ్మధారలోని నవోదయ స్కూల్ విద్యార్థులు శ్రీరామ నామ మంతో ర్యాలీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, బీజేపీ నాయకులు సురేష్‌బాబు, 14వ వార్డు అధ్యక్షులు రాకేష్ పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 42వ వార్డు జగన్నాధపురంలోని మూడుగుళ్ల జంక్షన్ నుంచి బీజేపీ సీనియర్ నాయకుడు గురుగోవింద్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం రాములవారి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హాజరయ్యారు. అలాగే ఉత్సవ విగ్రహాలతో పాటు భక్తులు రామలక్ష్మణుల వేషధారణ ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమంలో సురేష్‌బాబు, జ్యోతి, శ్రీదేవి, నిర్మల, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అంతా రామనామస్మరణం
22జిఎన్‌పి03

జ్ఞానాపురం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం, అల్లిపురం ప్రాంతాల్లోని వైష్ణవ ఆలయాలు, అంజనేయుని ఆలయాలు జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగాయి. అల్లిపురం వెంకటేశ్వరమెట్ట బల్లిగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో దీపాలు వెలిగించారు. కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పూజా కార్యక్రమాల్లో దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు కందుల నాగరాజు పాల్గొన్నారు. నీలమ్మవేపచెట్టు వద్ద ఆలయ ఛైర్మన్ బొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

జగదాంబ కూడలి: వన్‌టౌన్ బురుజుపేట ఆలయ ఆవరణలో అయోధ్యలో రాముని ప్రతిష్ఠ ఘట్టాలను తిలకించేందుకు వీలుగా ప్రత్యేక స్క్రీన్స్‌ను ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో పలు ఆలయాల్లో రామునికి ప్రత్యేకంగా పూజలు జరిపారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. మెయిన్ రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం శ్రీరామ నామస్మరణతో అధ్యాత్మికత సంతరించుకుంది. పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ, ఎల్లమ్మగుడుల్లో శ్రీరామునికి పూజలు జరిపారు. జీవీఎంసీ 35వ వార్డు పోలీస్ బ్యారెక్స్ శ్రీరామాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొన్నారు.

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్ వద్ద 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్ ఆధ్వర్యంలో సీతారాములుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు, బొగ్గు శ్రీను,గొర్లె అప్పారావు, పెంటకోట త్రినాధరావు, అజయ్‌బాబుతో పాటు 54,57వార్డు టీడీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


గ్రీన్‌సిటీలోని వైభవ వెంకటేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న టీడీపీ నేత శ్రీభరత్


సీతమ్మధార గాంధీనగర్‌లో భక్తహనుమాన్ చిత్రం వద్ద దీపాలు వెలుగిస్తున్న భక్తులు

మురళీనగర్; బీజేపీ 50వవార్డు అధ్యక్షులు కూన.వెంకటరావు ఆధ్వర్యంలో మాధవధారలోని పాత రామాలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పెన్మెత్సవిష్ణుకుమార్ , ఆ పార్టీ మాజీ నగర అధ్యక్షులు పృధ్వీరాజ్, 51వ వార్డు నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ యాత్రలో భాగంగా మురళీనగర్ జీవీఎంసీ హైస్కూలు వద్దమందిరంలో 50వవార్డు టీడీపీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైసీపీ నాయకులు కెకె.రాజు తదితరులు హాజరయ్యారు. మాధవధార కొండపైనున్న వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.

దొండపర్తి: దక్షిణ నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ కారాల మహేష్ ఆధ్వర్యంలో దొండపర్తి పురవీధుల్లో శ్రీరామ పల్లకి సేవా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా దక్షిణ నియోజకవర్గం కన్వీనర్ అత్తిలి శంకరరావు హాజరై ప్రసంగించారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు అంగటి కుమార్ రాజా, నాయకులు విజయానందరెడ్డి, కల్యాణి, చిల్లా మంగాదేవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అన్నసమారాధనలో ఎమ్మెల్యే గణబాబు, విష్ణుకుమార్ రాజు


దొండపర్తిలో శ్రీరామ పల్లకి సేవ

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం రేపు

33 అంశాలతో ఎజెండా

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు కార్యదర్శి పి.నల్లనయ్య తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో చర్చించేందుకు వీలుగా 33 అంశాలతో ఎజెండా తయారుచేసి సభ్యులకు అందజేశామన్నారు. ఎజెండాలో ప్రధానంగా జోన్-4 పరిధిలోని లీలామహల్ జంక్షన్ నుంచి చిత్రాలయ షాపింగ్‌మాల్ వరకూ రెండు వైపులా తారురోడ్డు పునర్నిర్మాణం కోసం రూ.45.46 లక్షలు, అలాగే వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద మెయిన్‌గేట్, ఎలివేషన్ పనుల కోసం రూ.49.86 లక్షలు వెచ్చించేందుకు ప్రతిపాదించారు. నగరానికి ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉంటున్నందున, జోన్-4 పరిధిలో 28వ వార్డు నుంచి 39వ వార్డు వరకూ, జోన్-5 పరిధిలో పోర్టు ఫ్లైఓవర్‌తోపాటు కాన్వెంట్ జంక్షన్ నుంచి ఐఎన్ఎస్ డేగా వరకూ నెల రోజులపాటు పారిశుధ్య నిర్వహణ కోసం అదనపు సిబ్బందిని రోజువారీ వేతనంపై నియామకం ప్రతిపాదన ఎజెండాలో పొందుపరిచారు. జోన్-4 పరిధి 39వ వార్డులో వ్యర్థాలను కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలించేందుకు వీలుగా ఎనిమిది తారాస్ లారీలను అద్దె ప్రాతిపదికన తీసుకుని సుమారు వంద ట్రిప్పులు తిప్పే ప్రతిపాదనను అజెండాలో చేర్చారు. ఇవికాకుండా పలు వార్డుల్లో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు, సామాజిక భవనాలకు అదనపు అంతస్థుల నిర్మాణం, ఖాళీగా వున్న దుకాణాల వేలం, హనుమంతవాక జంక్షన్ నుంచి విశాలాక్షి నగర్ మీదుగా జోడుగుళ్లపాలెం వరకూ రోడ్డు విస్తరణ ప్రతిపాదనలను పొందుపరిచారు.

అవగాహనతో ప్రమాదాలకు చెక్: డీటీసీ



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న డీటీసీ, ట్రాఫిక్ పోలీసులు

మురళీనగర్, జనవరి 22 ; రహదారి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని విశాఖపట్నం డీటీసీ జి.సి.రాజారత్నం అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలో ప్రధాన జంక్షన్ ఎన్ఏడీ కొత్తరోడ్డు వద్ద రవాణాశాఖ ఆధ్వర్యంలో పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బైకులు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, కార్లలో వెళ్లే వారు సీటు బెల్టు పెట్టుకుని డ్రైవ్ చేయడం తదితర ప్రాథమిక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్ఏడీ జంక్షన్ మీదుగా నిబంధనలు పాటిస్తూ వెళ్తున్న వారికి ఈసందర్భంగా పూలు, చాక్లెట్లు అందించి వారిని అభినందించారు. అనంతరం ప్లకార్డులతో ప్రయాణ భద్రతపై అవగాహన కల్పించారు. ఆర్టీవో ఆర్.సి.హెచ్.శ్రీనివాస్, వాహన తనిఖీదారులు మన్మోహన్, సహాయక ఎంవీఐ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

చెత్త కుప్పలతో అవస్థలు

సీతమ్మధార, జనవరి 22: నక్కవానిపాలెం, చైతన్యనగర్ ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో స్థానికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మద్దిలపాలెం నుంచి వెళ్లే నక్కవానిపాలెం, చైతన్యనగర్ ప్రాంతాల్లోని వినాయక, సాయి బాబా ఆలయాల వద్ద రహదారులపై చెత్త పేరుకుపోవడంతో భక్తులు అనేక అవస్థలు పడుతున్నారు. కొన్ని రోజుల కిందట గెడ్డలోని చెత్తను తొలగించి ఆలయం ఎదుట వేశారు. కానీ, ఇప్పటి వరకు దాన్ని పారిశుధ్య కార్మికులు తొలగించకపోవడంతో పలువురు మండిపడుతున్నారు. వెంటనే ఆ చెత్తను తొలగించి ఆలయ పరిసరాలను శుభ్రం చేయించాలని అధికారులను కోరుతున్నారు.


ఆలయం ఎదుట చెత్తకుప్ప

19,42,593

ఇదీ జిల్లాలో ఓటర్ల సంఖ్య

... 5వ పేజీ తరువాయి

సమయంలో విశాఖ పశ్చిమలో 2,34,917 నుంచి 2,06,943కు, దక్షిణలో 2,13,885 నుంచి 2,10,131కు, విశాఖ ఉత్తరంలో 2,74,646 నుంచి 2,74,114కు తగ్గారు.

ఇదిలావుండగా 2019 ఎన్నికల సమయంలో ఏడు అసెంబ్లీల పరిధిలో 18,81,674 మంది ఓటర్లు ఉండగా ...తాజాగా విడుదల చేసిన తుది జాబితాలో 19,42,593 ఉన్నారు. అప్పటితో పోల్చితే 60,919 మంది ఓటర్లు పెరిగారు. 2019లో గాజువాక నియోజకవర్గంలో 3,09,323 మంది, భీమిలిలో 3,05,958 మంది ఉండగా...ఇప్పుడు గాజువాక (3,23,671) సెగ్మెంట్‌ను భీమిలి (3,51,462) దాటేసింది. గడచిన ఐదేళ్లలో భీమిలిలో 45,304 మంది, గాజువాకలో 14,348 మంది, పెందుర్తిలో 30,571 మంది ఓటర్లు పెరిగారు.

అంగన్‌వాడీల తొలగింపు!

... 5వ పేజీ తరువాయి

వెళ్లేందుకు జిల్లా నుంచి వందలాది మంది బయలుదేరగా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. కొంతమందిని గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ నేపథ్యంలో సమ్మెలో ఉన్న వారిని విధుల్లో నుంచి తొలగించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు సమ్మెలో ఉన్న 1,343 మందిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో 696 మంది వర్కర్లు, 647 మంది హెల్పర్లు ఉన్నారు. విధుల్లో చేరిన 69 మంది వర్కర్లు, 50 మంది హెల్పర్లకు మినహాయింపు ఇచ్చారు. టెర్మినేషన్ ఉత్తర్వులను సదరు సిబ్బందికి అందించే బాధ్యతను ప్రభుత్వం రెవెన్యూ శాఖకు అప్పగించింది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు అందించిన తొలగింపు లేఖలను రెవెన్యూ సిబ్బంది ఇళ్లకు, వారు పనిచేసే కేంద్రాలకు అంటిస్తున్నారు. దీనిపై ఐసీడీఎస్ అధికారులను వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాలతో సిబ్బందిని విధుల నుంచి తొలగించామని, రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసి కొత్తవారిని తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వాన్ని టెర్మినేట్ చేస్తున్నాం..సమ్మె కొనసాగిస్తాం..

ప్రభుత్వ నిర్ణయాన్ని అంగన్‌వాడీ ఉద్యోగ సంఘ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ తరహా చర్యలతో భయపెట్టలేరని, తమ సమ్మె కొనసాగుతుందని స్పష్టంచేస్తున్నారు. విధుల నుంచి తమను ప్రభుత్వం టెర్మినేట్ చేయడం కాదని, తామే ప్రభుత్వాన్ని టెర్మినేట్ చేస్తున్నామని ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షురాలు తులసి పేర్కొన్నారు. సమ్మె యథావిధిగా కొనసాగుతుందని, ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు సమ్మెలోనే ఉంటామన్నారు. గడిచిన కొద్దిరోజుల నుంచి చేస్తున్నట్టుగానే జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం నుంచి సమ్మెలో ఉంటామని స్పష్టం చేశారు. అరెస్టులు, ఒత్తిళ్లతో భయపెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని, ఈ తరహా చర్యలు మంచివి కాదన్నారు.

నో టెండర్

... 5వ పేజీ తరువాయి

కొంత శాతం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ శాతం ఎవరు ఎక్కువ ఇస్తామంటే వారికే ప్రాజెక్టు ఇస్తారు. 33 ఏళ్ల తరువాత ఉన్నది ఉన్నట్టుగా వదిలేసి వెళ్లిపోవాలి.

ప్రభుత్వం పన్నుల ఆదాయం కోసం ప్రతి ఏటా భూముల విలువలు పెంచుకుంటూ పోతోంది. సాధారణంగా ఎక్కడ స్థిరాస్తి లావాదేవీలు జరిగితే అక్కడే విలువలు పెంచేవారు. వైసీపీ ప్రభుత్వం అలా కాకుండా ఏటా కొంత పెంచుకుంటూ పోతోంది. ఈ లెక్కన ఆ ఏరియాలో ఏటా మారే ప్రభుత్వ విలువ ప్రకారం అద్దె కూడా పెరుగుతుంది. ఈ లెక్కలన్నీ వేసుకున్న కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. గత నెల 14 నుంచి 28వ తేదీ వరకు టెండర్లకు సమయం ఇచ్చారు. ఒక్కరు కూడా రాకపోవడంతో మళ్లీ ఇప్పుడు జనవరి 21న నోటిఫికేషన్ ఇచ్చారు. ఫిబ్రవరి మూడో తేదీ వరకు గడువు ఇచ్చారు.

బస చేసేందుకు వసతి కూడా ఇవ్వాలని ప్రతిపాదన

అక్కడికి వినోదం కోసం వచ్చేవారు...రాత్రికి బస చేయడానికి కూడా ఏర్పాట్లు ఉంటే బాగుంటుందని, అలాగైతే తాము టెండర్లు వేస్తామని ఒకరిద్దరు ముందుకు వచ్చినట్టు తెలిసింది. మొత్తం ఏరియాలో 5 శాతం అందుకు ఉపయోగించుకుంటే ఫరవాలేదని, అలా కాకుండా హోటల్ కమ్ లాడ్జిలా అయితే మొత్తం కాన్సెప్ట్ దెబ్బతింటుందని అధికారులు సూచించారు. ఇప్పుడు ఆ విధంగా ఎవరు ఆసక్తి చూపుతారో చూడాలి.

లోకేశ్‌కు గండి బాబ్జీ జన్మదిన శుభాకాంక్షలు


హైదరాబాద్‌లో లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాబ్జీ

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 40వ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఆయన స్వగృహంలో టీడీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించారు.

నేడు సామాజిక సమతా సంకల్ప యాత్ర

సీతంపేట, జనవరి 22: విజయవాడ వేదికగా వేదికగా జరిగిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయం మహా శిల్పం ఆవిష్కరణ ఘట్టాన్ని పురస్కరించుకొని జిల్లాలో మంగళవారం నిర్వహించనున్న సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పిలుపునిచ్చారు. ఆయన వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులతో వెబ్ ఎక్స్ ద్వారా మాట్లాడారు. మంగళవారం ఉదయం 9.45 గంటలకు రామాటాకీస్ కూడలి వద్ద జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది మానవహారం ఉంటుందన్నారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ, భవన్‌లో ఛాయాచిత్ర ప్రదర్శన, జిల్లాస్థాయి సెమినార్ ఉంటుందని తెలిపారు.

వెంకటేశ్వరమెట్ట సమస్యకు త్వరలో పరిష్కారం: ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం, జనవరి 22: జీవీ ఎంసీ 33వవార్డు వెంకటేశ్వరమెట్టలో దశాబ్దాలుగా ఉన్న నివాసితుల సమస్య కు త్వరలోనే పరిష్కారం లభించనున్నట్టు ఎమ్మెల్యే వా సుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. ఈనెల 30న జరగునున్న రా ష్ట్ర మంత్రి మండలిలో ఈసమస్య చర్చకు రానుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న నివాసితులకు గత ప్రభుత్వాల హ యాంలో ఎప్పుడూ న్యాయం జరగలేదని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వారికి అండగా ఉంటూ సమస్యపరిష్కారానికి ముందుకు వచ్చిందని అన్నారు.ఈ సమస్యపై అమరావతిలోఅడిషనల్ సెక్రటరీ రేవు ము త్యాలరాజు, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సాయి ప్రసాద్‌లకు వినతి పత్రాలిచ్చినట్టు ఆయన చెప్పారు.

'జగనన్నకు చెబుదాం'కు 156 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట, జనవరి 22: జగనన్నకు చెబుదాం కార్య క్రమానికి వచ్చిన వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వ నాథన్ అధికారులకు సూచించారు. సోమ వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్ర మంలో వినతుల ను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి 156 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 38, జీవీఎంసీకి 41, పోలీసు శాఖ సంబంధించి 7, ఇతర విభాగాలకు చెందిన 70 వినతులు స్వీకరించారు. నిర్దిత వ్యవధిలో ఈ అర్జీలకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు జేసీ ఆదేశించారు. డీఆర్వో మోహనకుమార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

గోపాలపట్నం, జనవరి 22: గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయి రవాణా జరుగుతుందనే సమాచారంపై స్థానిక శ్మశాన వాటిక కూడలిలో మాటువేసిన పోలీసులు నెల్లూరుకు చెందిన ఎన్.నవీన్, పి.సురేశ్ వ్యక్తులకు చెందిన బ్యాగులు సోదాచేశారు. వారి వద్ద సుమారు 7 ఏడు కిలోల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన గోపాలపట్నం పోలీసులు నిందితులరె అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

4న జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

డాబాగార్డెన్స్, జనవరి 22: జాతీయ 14వ బాడీ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర జట్లను ఫిబ్రవరి 4న ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని రామాటాకీస్ ఎదురుగా వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో ఎంపిక చేయనున్నట్టు ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్ తెలిపారు. పురుషుల విభాగంలో 55 కేజీల నుంచి 100 కేజీల వరకు 10 గ్రూపుల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. 40 , 45, 50, 60, 65 వయసుల వారికి మాస్టర్ విభాగంలో సెలక్షన్ ఉంటుందన్నారు. ఎంపికైన పోటీదారులు మార్చి 1, 2 తేదీల్లో బీహార్ రాజధాని పాట్నాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుగా పాల్గొంటారని తెలిపారు.విశాఖతోపాటు ఇతర జిల్లాలకు చెందిన వారు ఈ ఎంపికలో పాల్గొనేందుకు వీలుగా ముందుగా పుల్లప్స్, డీప్స్ వీడియోస్‌పంపాల్సి ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్: 88852 03519లో సంప్రదించాలన్నారు.

జగన్ పాలనపై షర్మిల ఇంతకాలానికి స్పందిస్తారా?

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ధ్వజం


సమావేశంలో మాట్లాడుతూన్న మహ్మద్ నజీర్

మహారాణిపేట, జనవరి 22: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ కోణంలోనివా? లేదా జగన్‌తో లాలూచీ రాజకీయాలు చేయాలని అనుకుంటు న్నారా..? అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ప్రశ్నించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 57 నెలలుగా జగన్ పాలనపై తమపార్టీ పోరాటం చేస్తోందని, జగన్ దారుణాలపై షర్మిల ఇంత కాలానికి స్పందించకపోవడమేమిటని ఆయన నిలదీశారు. రాష్ట్రంలో మైనారిటీల ఊచకోతకు జగన్ పాల్పడితే ఆమె ఎందుకు ఇప్పటివరకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మరోసారి ప్రజలను మోసగించేందుకు షర్మిల ఎన్నికల ముందు వచ్చారన్నారు. ప్రజలు ఈ అన్నాచెల్లెలిని నమ్మేంత అమాయకులు కాదన్నారు. ఎన్ని కుట్రలతో రాజకీయాలు చేసినా వారిని విశ్వసించడంలేదన్నారు. మరోవైపు వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి లేదు, ప్రజాస్వామ్యం మచ్చుకైనా కానరావడంలేదు.. నిరుద్యోగులు ఉద్యోగాలు లేక సతమవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా, మహ్మద్ జఫ్రుల్లా , మహ్మద్‌గౌస్, ఖాలీషా పాల్గొన్నారు.

లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ.లక్ష విరాళం

సీతమ్మధార, జనవరి 22: లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ ఆసుపత్రి సేవలు అద్భుతమని ఆంధ్రా యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం పూర్వ ఆచార్యులు బి.ప్రసాదరావు పేర్కొన్నారు. సీతమ్మధారలోని ఈ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ వి.ఉమామహేశ్వరరావును ఆయన సోమవారం కలిసి ఆసుపత్రిలో మెరుగైనసేవలు కల్పనకు వీలుగా రూ.లక్ష విరాళంగా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోనే లయన్స్ ఆసుపత్రికి గుర్తింపు ఉందన్నారు.


చెక్కు అందచేస్తున్న ప్రొఫెసర్ ప్రసాదరావు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివి..

సీతమ్మధార, జనవరి 22: ఆశీల్‌మెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో విద్యుత్ ఫీడర్ మరమ్మత్తులు నిర్వహిస్తున్నందున మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్ 1 ట్రాన్స్‌కో ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సీతమ్మధార అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంతం, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, ఆర్ అండ్‌బీ క్వార్టర్స్, ఎఎస్ఆర్ స్టాట్యూ, క్షత్రియ కళ్యాణమండపం పరిసరాలు, నారాయణ స్కూల్ ప్రాంతం, ఎఎస్ఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా పోలమాంబ తొలేళ్ల సంబరాలు

జగదాంబ కూడలి, జనవరి 22: జీవీఎంసీ 30వ వార్డు కుమ్మరవీధి పోలమాంబ 66వ పరస ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలేళ్ల పురస్కరించుకుని అమ్మవారిని పసుపు రాసి, చీర, ఆభరణాలతో అలంకరించారు. ఉదయం 7 గంటల సమయంలతో మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉన్న పోలమ్మను దర్శించుకొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తమ కోర్కెలు తీర్చాలంటూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన పసుపును ముద్దగా చేసి విగ్రహానికి పూతగావేశారు. సాయంత్రం ఆలయం నుంచి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి జలంతో మహిళలు అభిషేకం జరిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తుతో పర్యవేక్షించారు. పురువీధులు విద్యుత్ దీపకాంతులతో ప్రకాశించాయి. రాత్రి ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పురప్రజలను అలరించాయి.


పసుపు అద్దకంలో అమ్మవారు

జీవీఎంసీపై సిటీ పోలీసుల విజయం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 22: జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న వార్షిక ఇనిస్టిట్యూషన్ లీగ్ టోర్నీలో భాగంగా సోమవారం జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో సిటీ పోలీసు ఆరు వికెట్ల తేడాతో జీవీఎంసీపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జీవీఎంసీ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 143 పరుగులు చేసింది. జి.నరేష్‌కుమార్ (37), ఏ సునంద్ (38) రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సిటీ పోలీసు 18.2 ఓవర్లలో నాలుగు వికెట్లకు 146 పరుగులతో లక్ష్యాన్ని సునాయాసంగా చేధించి ఫైనల్స్‌కు ప్రవేశించింది. సిటీ పోలీసు జట్టులో ఎం.సంతోష్ (42), వి.త్రినాధ్ (27), వి.గోపీకృష్ణ (26) రాణించి జట్టుకువిజయాన్నందించారు.

విద్యార్థులకు ల్యాబ్‌ట్యాబ్‌లు పంపిణీ

సీతమ్మధార, జనవరి 22: సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని జీవీఎంసీ ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న 214 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ చేతులమీదుగా బైజూస్ లాబ్‌ ట్యాబ్స్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాధవధార;మాధవధార జీవీఎంసీ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు సోమవారం ల్యాబ్‌ట్యాబ్‌లను అందించారు. హెచ్‌ఎం బి.హేమలత అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నార్త్ ఇన్‌చార్జి కె.కె.రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని వీటిని అందించారు. బాలలు ట్యాబ్‌ల సాంకేతిక సాయంతో చదువుల్లో మరింత ప్రగతి సాధించాలని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటరు వి.ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


ట్యాబ్‌లు అందిస్తున్న హెచ్‌ఎం రామ్ ప్రసాద్



సీజీఎం సోప్తికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తే సహించబోం

సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు అయోధ్యరాం

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 22: స్టీల్‌ప్లాంట్ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదని సీఐటీయూ ఉక్కు గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరాం అన్నారు. ఉక్కు సీజీఎం(వర్క్స్) సోప్తితో సోమవారం నాయకులు సమావేశమై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అయోధ్యరాం మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం రోజుకొక ఇంటర్నల్ సర్క్యులర్లతో కార్మికులను భయపడేలా చేస్తుందని, ఉక్కు మంత్రిత్వశాఖ ప్లాంట్‌లో ఐదువేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ప్రకటించిందని, అయినా వీటిని భర్తీ చేయకుండా ఉన్న కార్మికులపైనే పని భారాన్ని మోపుతున్నారన్నారు. ఎంతో కష్టపడి 30 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను మెడికల్ అన్‌ఫిట్ పేరుతో తొలగిస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, డీవీ రమణారెడ్డి, కె.ప్రకాశ్, సన్యాసిరావు, పి.శ్రీనివాసరాజు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శ్రమించే ఉద్యోగులకు గుర్తింపు



ప్రసాద్‌బాబును సత్కరిస్తున్న అధికారులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 22: స్టీల్‌ప్లాంట్ ప్రగతిలో అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులకు ఎల్లవేళలా గుర్తింపు లభిస్తుందని ఆర్ఎస్అండ్ఆర్ఎస్ ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి జేకే శర్మ పేర్కొన్నారు. విభాగంలో 35 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న టీపీ ప్రసాద్‌బాబును సోమవారం స్టీల్ క్లబ్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో ప్రసాద్‌బాబు జూనియర్ ఉద్యోగులకు సలహాలు, సూచనలు ఇవ్వడం ఆనందనీయమన్నారు. విజిలెన్స్ అధికారి బి.జోన్స్‌బాబు మాట్లాడుతూ రానున్న కాలంలో సంస్థ మరింత ప్రగతి కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎస్ఎల్ఎన్.రావు, జె.మానవేంద్రనాథ్, శ్రీరమణ, ప్రేమ్‌కుమార్, రాంప్రసాద్, పి.శ్రీనివాసరావు, కార్మిక నాయకులు ఉండవల్లి శ్రీనివాసరావు, ఎస్‌వీపీ రాజు, గంగవరం గోపి, తదితదులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 22: లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు షీలానగర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో సోమవారం రూ.కోటి 80 లక్షలతో ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా షీలానగర్, హరిజన జగ్గయ్య పాలెం, వెంకటేశ్వర కాలనీ,పోర్టు రోడ్డు,గవర జగ్గయ్యపాలెంలో తీవ్ర లోఓల్టేజ్ సమస్యతో ప్రజలు సతమతం అయ్యేవారని, వారి వినతుల మేరకు ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఆ సమస్యను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు బీకే నాయుడు, శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, మీనకేతనరావు, బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల పరస

అగనంపూడి, జనవరి 22: అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీలోని డొంకాడ రామాలయం వద్ద సోమవారం సీతారాముల పరసను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పరసను నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, బొబ్బరి అప్పారావు, డి.సన్యాసిరావు, కె.శ్రీను, ఎ.అప్పారావు, బి.సత్తిబాబు, డి.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి),
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 20, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 44, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 18, క్యారెట్ 28, దొండకాయలు 22, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 74, బరబాటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 44, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీర దోస 24, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30, కంద 54, దేముడుచిక్కుడు 34, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	563
విజయనగరం	567
శ్రీకాకుళం	567

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



గోపాలపట్నంలో ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే పి.గణబాబు, తదితరులు



బీజేపీ ఆధ్వర్యంలో గాజువాకలో శ్రీరాముని కటౌట్‌తో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



71వ వార్డులో శ్రీరాముని వేషధారణతో ఊరేగింపు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అంతా రామమయం..

అయోధ్యలో ఆలయ ప్రారంభం, బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నగర సంకీర్తనలు, ఊరేగింపులలో అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, భక్తులు

గాజువాక /ఉక్కుటౌన్‌షిప్, జనవరి 22: అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం.. బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని నగరంలోని అన్ని ప్రాంతాలు రామ నామంతో మార్మోగిపోయింది. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల సీతారాముల చిత్రపటాలను ప్రదర్శించి పూజలు జరపడంతో పాటు అన్న సమారాధనలు చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో వీ-స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నపూర్‌భట్ పాల్గొన్నారు. గాజువాకలోని రామాలయాల్లో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు పాల్గొని పూజలు జరిపారు. అనంతరం భారీ ఊరేగింపు నిర్వహించారు. 71వ వార్డులో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో రాముని వేషధారణతో నంది అవార్డు గ్రహిత జీఎల్ నాయుడు ఆకట్టుకున్నారు. ఈ ర్యాలీ స్థానిక నాయకులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 70, 71, 86, 87 వార్డుల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. 71వ వార్డు రామాలయంలో జరిగిన పూజల్లో జనసేన నాయకులు కోన తాతారావు, కరణం కనకారావు, సిరసపల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. 86వ వార్డు శాతవాహన నగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో, రాజీవ్‌నగర్, సుందరయ్య కాలనీలోని రామాలయాల్లో, గ్రీన్ సిటీ శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు, హోమాలు జరిపారు. సాయంత్రం జరిగిన దీపారాధనలో మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. 70వ వార్డు పరిధి శ్రీనివాస నగర్‌లోని ట్వింకిల్ స్కూల్లో, శ్రీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో, శివసాయినగర్ గాయత్రీ ఆలయంలో అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠను లైవ్‌లో విద్యార్థులు, భక్తులు తిలకించారు. ఆయా పాఠశాలల చిన్నారులు శ్రీరాముడు, సీత, లక్షణ సమేత ఆంజనేయస్వామి వేషధారణతో బాల రామాయణం నృత్య రూపకాలను ప్రదర్శించారు. 87వ వార్డులోని కణితి రామాలయంలో పూజలు చేశారు.

అగనంపూడి, జనవరి 22: జీవీఎంసీ 79, 85వ వార్డుల పరిధిలోని అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంతాల్లో గల రామాలయాలు సోమవారం భక్తులతో పోటెత్తాయి. జాబిలి హిల్స్ కాలనీలోని రామాలయంలో పూజలు, అర్చనలు జరపడంతో పాటు హనుమాన్ చాలీసా, శ్రీరామ నామాన్ని పఠించారు. ఎల్ఈడీ స్క్రీన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో భక్తులంతా అయోధ్యలోని బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను వీక్షించారు. అలాగే శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి, పాత అగనంపూడి, దానబోయినపాలెం రామాలయాల్లో పూజలు చేశారు. షిర్డీ సాయి ఆలయంలోనూ శ్రీరామునికి పూజలు జరిపారు. తెలుగు మహిళ 79వ వార్డు అధ్యక్షురాలు జి.కనక భవానీ, తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్ సిటీలో దీపాలు వెలిగిస్తున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



పెందుర్తిలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ వద్ద మహిళల కోలాటం

గోపాలపట్నం: గోపాలపట్నం రామాలయంలో నిర్వహించిన పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు ఆలయానికి విచ్చేసి సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన రహదారిలో సీతారాముల చిత్రపటాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతాలోని రామాలయాలన్నీ జై శ్రీరామ్ నినాదంతో మార్మోగాయి. వేకువజాము నుంచే పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు రామాలయాలకు విచ్చేసి సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. పలుచోట్ల కోలాటాల నడుమ సీతారాముల చిత్రపటాలను పట్టుకుని భక్తులు ప్రదర్శనలు చేపట్టారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

పెందుర్తి: స్థానిక రామాంజనేయ ఆలయ సమీపంలో డీఆర్‌సీ ట్రస్టు వ్యవస్థాపకుడు దాడి రమణచిట్టి ఆధ్వర్యంలో డీఆర్‌సీ మాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్‌లో అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పలువురు భక్తులు వీక్షించారు. భజనలు, కోలాటాల నడుమ రామనామాన్ని జపించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే సరిపల్లిలోని రామాలయంలోని శ్రీరాముని విగ్రహంతో భక్తులు వేకువజామున రామ కీర్తనలతో నగర సంకీర్తన చేపట్టారు. ఆలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి రామాలయంలో దీపారాధన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె రామకృష్ణ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్‌లోని శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాయంలో శ్రీరాముని ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశాక రాములవారి భక్తి గీతాలను ఆలపించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై అయోధ్యలోని బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను భక్తులు తిలకించారు. వేపగుంట రామాలయంలో భక్తులు శ్రీరామనామ జపం చేశారు. అలాగే సేనాపతివానిపాలెంలోని రామాలయంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం ఇళ్ల వద్ద భక్తులు దీపాలు వెలిగించేలా ఆలయ కమిటీ నిర్వాహకుడు బి.నరసింహనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శ్రీలక్ష్మీనరసింహనగర్‌లోని శ్రీగోపిజనవల్లభస్వామి ఆలయంలో శ్రీరామనామం జపించారు. సాయంత్రం ఆలయంలో దీపారాధన చేపట్టారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: ఎన్ఏడీ నుంచి మార్వాడీ సమాజం ఆధ్వర్యంలో కరాసలోని రామాలయం వరకు శోభాయాత్ర చేపట్టారు. చినబుచ్చిరాజుపాలెంలోని కోదండరామాలయంలో శ్రీరామునికి పూజలు, భజనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో టీవీని ఏర్పాటు చేసి భక్తులు అయోధ్యలోని ఘట్టాలను తిలకించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

శ్రీరామ్ నినాదంతో యువకుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న యువకులు

పెదగంట్యాడ: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠకు మద్దతుగా పెదగంట్యాడలో యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండల కార్యాలయం వద్ద కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి జై శ్రీరామ్ నినాదంతో ఉన్న కాషాయ రంగు జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ బైక్ ర్యాలీ నెల్లిముక్కు, సీతానగరం, శ్రీకువానిపాలెం, దుర్గవానిపలెం, అయ్యన్నపాలెం, మొల్లివానిపాలెం, సిద్ధేశ్వరం, కోరాడ, నడుపూరు, బర్మాకాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల మీదుగా పెదగంట్యాడ కూడలి వరకు సాగింది. జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ ర్యాలీలో పాల్గొన్న యువకులు నినదించారు. అనంతరం జరిగిన సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ 500 ఏళ్ల నాటి హిందువుల స్వప్నం సాకారమైందన్నారు. మనిషి ఎలా జీవించాలో రాముని జీవితమే ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పెద్దాడ సోమునాయుడు, స్థానిక యువకులు ఎం.పెంటయ్య, పి.శ్రీరామరెడ్డి, ఎం.అప్పారావు, ఎం.రమణ, డీఎస్ఎన్ రాజు, డి.అప్పారావు, ఎం.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రియదర్శిని కాలనీ, నెల్లిముక్కు, దయాళ్‌నగర్, తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో వేకువజాము నుంచే పూజాది కార్యక్రమాలను చేపట్టారు. శ్రీరాముని కథలను ఆలయ పూజార్లు భక్తులకు వినిపించారు. ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

వృథాగా అన్న క్యాంటీన్ భవనం

» వినియోగంలో లేక శిథిలం..

» అసాంఘిక కార్యకలాపాలు

పెందుర్తి, జనవరి 22: గత టీడీపీ ప్రభుత్వం పేదలకు రూ. 5కే భోజనం అందించాలనే సదుద్దేశంతో పెందుర్తిలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మూసివేసి తాళం వేశారు. దీంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. టీడీపీ పాలనలో వేసిన పసుపు రంగు కొన్నేళ్ల కిందట తీసేసి తెలుపు రంగు వేశారు. ఈ ఖాళీగా ఉన్న ఈభవనాన్ని కరోనా సమయంలో కొవిడ్ నిర్ధారణ కేంద్రంగా వినియోగించారు. అప్పట్లో కొవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహించారు. తరువాత వినియోగంలో లేక నిరుపయోగంగామారింది. ఆలనాపాలనా లేకపోవడంతో భవనం చుట్టూ పొదలు, పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరుకుంది. చీకటి పడితే ఇది అసాంఘిక కార్యకపాలకు అడ్డా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇందులో గల విలువైన భవన సామగ్రి కనిపించకుండా పోయింది. ఈక్రమంలో రూ. 5కే పేదలకు భోజనం అందించిన అన్న క్యాంటీన్ అప్పట్లో రోజుకు 500 మంది పైగా సద్వినియోగం చేసుకునేవారు. ప్రస్తుతం వృథాగా మారిన ఈ భవనం ప్రజాప్రయోజనాలకు వినియోగిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు.



పెందుర్తిలో నిరుపయోగంగా వదిలేసిన అన్న క్యాంటీన్



ఆస్పత్రి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న దొరైస్వామి

గాజువాకలో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి ప్రారంభం

గాజువాక, జనవరి 22: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి గాజువాక సెంటర్‌ను సోమవారం బ్రాండిక్స్ ఇండియా భాగస్వామి దొరైస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వ నిర్మూలన కోసం శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు విశేషమైనవన్నారు. నిరుపేదలకు నేత్ర చికిత్సలు అందించేందుకుశంకర్ ఫౌండేషన్‌తో కలిసి బ్రాండిక్స్ కృషి చేస్తుందన్నారు. కంటి సంరక్షణలో జాతీయ ప్రమాణాలను పాటిస్తూ ఎంతోమందికి శంకర్ ఫౌండేషన్ మెరుగైన వైద్య సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (మెడికల్) ప్రకాశ్, జీఎం (మెడికల్) సారంగి, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ఆత్మకూరి కృష్ణకుమార్, విజయకుమార్, జీఎం (అడ్మిన్, ఆపరేషన్స్) రాధాకృష్ణన్, వైద్యులు నస్రిన్, శిరీష, మమత, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, జనవరి 22: గాజువాకలోని సర్వే నంబర్ 86, 273, 274లలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాజువాకలో అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే జీవీఎంసీ, తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు అంగ కృష్ణ, అప్పలరాజు, కామేశ్వరరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 5 ఫిర్యాదులు

వేపగుంట జనవరి 22: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 5 ఫిర్యాదులు అందాయి. వీటిలో 91వ వార్డు రామకృష్ణానగర్‌లో వీధిదీపాలు మరమ్మతు చేపట్టాలని,చిమాలాపల్లిలో మురుగునీటితో ఇబ్బందులు తలెత్తున్నాయని, శ్రీ లక్ష్మీనగర్‌లో కాలువపై పలకలు తొలగించాలని కోరారు. అప్పన్నపాలెంలోడ్రైనేజీ సదుపాయం కల్పించాలనిఫిర్యాదులు అందాయి. వీటి పరిష్కారానికి చర్యలు చేపడతామని జెడ్సీ మల్లయ్యనాయుడు పేర్కొన్నారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పరస

మల్కాపురం, జనవరి 22 : మల్కాపురం మరిడిమాంబ అమ్మవారి పరస ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. నగరం నలుమూలలనుంచి అనేక మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ఈఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రజాప్రతినిధులతో పాటు, రాజకీయ పార్టీల నాయకులు దర్శించుకున్నారు.



అమ్మవారు

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు..

వేపగుంట జనవరి 22: నాయుడుతోట:11 కె.వి.ఫీడర్ మెంటెయినెన్స్ పనుల్లో భాగంగా చెట్లు కొమ్మలు తొలగించనున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేయనున్నట్లు వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. విరాట్ నగర్, దుర్గానగర్, గౌతమ్‌నగర్, సాయిమాధవనగర్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు గమనించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యారాడ బీచ్‌కు సందర్శకుల తాకిడి



బీచ్‌లో సందర్శకులు సందడి

సింధియా, జనవరి 22: యారాడ బీచ్‌కు సోమవారం అధిక సంఖ్యలో పర్యాటకులు, సందర్శకులు వచ్చారు. విద్యాసంస్థలు, పలు కార్యాలయాల నుంచి పలువురు రావటంతో బీచ్ కళకళలాడింది. అయితే, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు.

'వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'

మల్కాపురం, జనవరి 22: గ్రేటర్ విశాఖ 60వ వార్డు జనతాకాలనీలోని బావిలో కార్పొరేటర్ పీవీ సురేశ్ సోమవార గంబూషియాచేపలను విడుదల చే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పులతో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవి కుమార్ , సూపర్‌వైజర్లు దుల్లా శ్రీనివాసరావు, పి. ఈశ్వరరావు ఉన్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే అదీప్‌రాజ్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

గోపాలపట్నం, జనవరి 22: గ్రేటర్ 88వ వార్డు గవర జగ్గయ్యపాలెం గ్రామంలోని రూ. 30లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, స్థానిక నేతలు జి.మహాలక్ష్మి నాయుడు, గవర సత్తిబాబు, ఆళ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సింధియా, జనవరి 22: మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. వార్డులో సోమవారం సీఓ, ఆర్పీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజబాబు, మహేష్, వర్మ, సంతు, ఈశ్వరి పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేత రామారావు

కూర్మన్నపాలెం, జనవరి 22: స్టీల్‌ప్లాంట్ యాజమాన్య నియంతృత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు ఎస్.రామారావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,075వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను సెయిల్, ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యాలు బలపరచడం భావ్యం కాదన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఆంధ్రా జోలికి వస్తే వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్‌కు ఏమి గతి పట్టిందో బీజేపీకి అదే పడుతుందని హెచ్చరించారు. ఉక్కు కర్మాగారం జాతీయ సంపద అని, దీనిని పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరంధామయ్య, యు.రామస్వామి, సన్యాసిరావు, గోపి, ప్రసాద్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామారావు

ప్రభుత్వం దిగిరాక తప్పదు

» అంగన్‌వాడీల హెచ్చరిక

» 'చలో విజయవాడ' భగ్నంపై ఆగ్రహం

పెందుర్తి, జనవరి 22: తమ సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో పలువురి అంగన్‌వాడీ కార్యకర్తలను ముందస్తుగా పోలీసులు నిర్బంధించారు. ఆదివారం రాత్రి సమయంలో విజయవాడకు పయనమైన వారి సమాచారం తెలుసుకుని నిఘా పెట్టారు. ఈ క్రమంలో సుమారు 45 మంది అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని సుజాతనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో నిర్బంధించారు. అనంతరం తెల్లవారుజామున వారిని పూచీకత్తుపై విడిచిపెట్టారు. నిర్బంధంలో ఉన్న అంగన్‌వాడీలు సీఎం జగన్, వైసీపీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళా శక్తి ఏమిటో రానున్న ఎన్నికల్లో జగన్, వైసీపీ నేతలకు రుచి చూపిస్తామని హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్ ఎదుట రాస్తారోకో...

అంగన్‌వాడీలను అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం పెందుర్తి పోలీసుస్టేషన్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా వైసీపీ ప్రభుత్వ పోలీసులతో తమను నిర్బంధించి ప్రభుత్వం చేతకానితనాన్ని చాటుకుందని ఆ రోపించారు. అణచివేతలతో తమ పోరాటాన్ని ఆపలేరని నినాదాలు చేశారు. అనంతరం మానవహారంగా నిల్చొని ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాల చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలున్నారు.



పెందుర్తిలోని ఓ కల్యాణ మండపంలో నిర్బంధించిన అంగన్‌వాడీలు


జ్ఞానాపురంలో నిర్వహించిన పూజల్లో జనసేన నేత కందుల నాగరాజు


మాధవధారలో చేపట్టిన శోభాయాత్రలో విష్ణుకుమార్ రాజు


సీతంపేటలో కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న సీతారాముల కళ్యాణం

మార్మోగిన శ్రీరామ నామస్మరణ

- అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని సందడి
- శోభాయాత్రలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సీతమ్మధార, జనవరి 22: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సీతమ్మధార గాంధీనగర్ అభయ అంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరాముడు, అంజనేయస్వామి చిత్రాలనువేసి భక్తులు చుట్టు దీపాలు వెలిగించారు. సీతంపేటలో మూడుగుళ్లపక్కనున్న కళ్యాణ మండపంలో షిర్డీ సాయిబాబా భజన మండల సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కళ్యాణం, పట్టాభిషేక మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సీతమ్మధారలోని నవోదయ స్కూల్ విద్యార్థులు శ్రీరామ నామ మంతో ర్యాలీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, బీజేపీ నాయకులు సురేష్‌బాబు, 14వ వార్డు అధ్యక్షులు రాకేష్ పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 42వ వార్డు జగన్నాధపురంలోని మూడుగుళ్ల జంక్షన్ నుంచి బీజేపీ సీనియర్ నాయకుడు గురుగోవింద్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం రాములవారి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హాజరయ్యారు. అలాగే ఉత్సవ విగ్రహాలతో పాటు భక్తులు రామలక్ష్మణుల వేషధారణ ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమంలో సురేష్‌బాబు, జ్యోతి, శ్రీదేవి, నిర్మల, రత్నం తదితరులు పాల్గొన్నారు.


అంతా రామనామస్మరణం
22జిఎన్‌పి03

జ్ఞానాపురం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం, అల్లిపురం ప్రాంతాల్లోని వైష్ణవ ఆలయాలు, అంజనేయుని ఆలయాలు జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగాయి. అల్లిపురం వెంకటేశ్వరమెట్ట బల్లిగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో దీపాలు వెలిగించారు. కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పూజా కార్యక్రమాల్లో దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు కందుల నాగరాజు పాల్గొన్నారు. నీలమ్మవేపచెట్టు వద్ద ఆలయ చైర్మన్ బొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

జగదాంబ కూడలి: వన్‌టౌన్ బురుజుపేట ఆలయ ఆవరణలో అయోధ్యలో రాముని ప్రతిష్ఠ ఘట్టాలను తిలకించేందుకు వీలుగా ప్రత్యేక స్క్రీన్స్‌ను ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో పలు ఆలయాల్లో రామునికి ప్రత్యేకంగా పూజలు జరిపారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. మెయిన్ రోడ్డు అంజనేయస్వామి ఆలయం శ్రీరామ నామస్మరణతో అధ్యాత్మికత సంతరించుకుంది. పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ, ఎల్లమ్మగుడుల్లో శ్రీరామునికి పూజలు జరిపారు. జీవీఎంసీ 35వ వార్డు పోలీస్ బ్యారెక్స్ శ్రీరామాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొన్నారు.

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్ వద్ద 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్ ఆధ్వర్యంలో సీతారాములుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు, బొగ్గు శ్రీను,గొర్లె అప్పారావు, పెంటకోట త్రినాదరావు, అజయ్‌బాబుతో పాటు 54,57వార్డు టీడీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


గ్రీన్‌పార్క్‌లోని వైభవ వెంకటేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న టీడీపీ నేత శ్రీభరత్


సీతమ్మధార గాంధీనగర్‌లో భక్తహనుమాన్ చిత్రం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మురళీనగర్; బీజేపీ 50వవార్డు అధ్యక్షులు కూన.వెంకటరావు ఆధ్వర్యంలో మాధవధారలోని పాత రామాలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మె ల్యే పెన్మెత్సవిష్ణుకుమార్ , ఆ పార్టీ మాజీ నగర అధ్యక్షులు పృధ్వీరాజ్, 51వ వార్డు నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ యాత్రలో భాగంగా మురళీనగర్ జీవీఎంసీ హైస్కూలు వద్దమందిరంలో 50వవార్డు టీడీపీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైసీపీ నాయకులు కెకె.రాజు తదితరులు హాజరయ్యారు. మాధవధార కొండపైనున్న వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.

దొండపర్తి: దక్షిణ నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ కారాల మహేష్ ఆధ్వర్యంలో దొండపర్తి పురవీధుల్లో శ్రీరామ పల్లకి సేవా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గం కన్వీనర్ అత్తిలి శంకరరావు హాజరై ప్రసంగించారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు అంగటి కుమార్ రాజా, నాయకులు విజయానందరెడ్డి, కల్యాణి, చిల్లా మంగాదేవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అన్నసమారాధనలో ఎమ్మెల్యే గణబాబు, విష్ణుకుమార్ రాజు


దొండపర్తిలో శ్రీరామ పల్లకి సేవ

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం రేపు

33 అంశాలతో ఎజెండా

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు కార్యదర్శి పి.నల్లనయ్య తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో చర్చించేందుకు వీలుగా 33 అంశాలతో ఎజెండా తయారుచేసి సభ్యులకు అందజేశామన్నారు. ఎజెండాలో ప్రధానంగా జోన్-4 పరిధిలోని లీలామహల్ జంక్షన్ నుంచి చిత్రాలయ షాపింగ్‌మాల్ వరకూ రెండు వైపులా తారురోడ్డు పునర్నిర్మాణం కోసం రూ.45.46 లక్షలు, అలాగే వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద మెయిన్‌గేట్, ఎలివేషన్ పనుల కోసం రూ.49.86 లక్షలు వెచ్చించేందుకు ప్రతిపాదించారు. నగరానికి ప్రముఖల తాకిడి ఎక్కువగా ఉంటున్నందున, జోన్-4 పరిధిలో 28వ వార్డు నుంచి 39వ వార్డు వరకూ, జోన్-5 పరిధిలో పోర్టు ఫ్లైఓవర్‌తోపాటు కాన్వెంట్ జంక్షన్ నుంచి ఐఎన్ఎస్ డేగా వరకూ నెల రోజులపాటు పారిశుధ్య నిర్వహణ కోసం అదనపు సిబ్బందిని రోజువారీ వేతనంపై నియామకం ప్రతిపాదన ఎజెండాలో పొందుపరిచారు. జోన్-4 పరిధి 39వ వార్డులో వ్యర్థాలను కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలించేందుకు వీలుగా ఎనిమిది తారాస్ లారీలను అద్దె ప్రాతిపదికన తీసుకుని సుమారు వంద ట్రిప్పులు తిప్పే ప్రతిపాదనను అజెండాలో చేర్చారు. ఇవికాకుండా పలు వార్డుల్లో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు, సామాజిక భవనాలకు అదనపు అంతస్థుల నిర్మాణం, ఖాళీగా వున్న దుకాణాల వేలం, హనుమంతవాక జంక్షన్ నుంచి విశాలాక్షి నగర్ మీదుగా జోడుగుళ్లపాలెం వరకూ రోడ్డు విస్తరణ ప్రతిపాదనలను పొందుపరిచారు.

అవగాహనతో ప్రమాదాలకు చెక్: డీటీసీ



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న డీటీసీ, ట్రాఫిక్ పోలీసులు

మురళీనగర్, జనవరి 22 ; రహదారి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని విశాఖపట్నం డీటీసీ జి.సి.రాజారత్నం అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలో ప్రధాన జంక్షన్ ఎన్ఏడీ కొత్తరోడ్డు వద్ద రవాణాశాఖ ఆధ్వర్యంలో పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బైకులు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, కార్లలో వెళ్లే వారు సీటు బెల్టు పెట్టుకుని డ్రైవ్ చేయడం తదితర ప్రాథమిక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్ఏడీ జంక్షన్ మీదుగా నిబంధనలు పాటిస్తూ వెళ్తున్న వారికి ఈసందర్భంగా పూలు, చాక్లెట్లు అందించి వారిని అభినందించారు. అనంతరం ప్లకార్డులతో ప్రయాణ భద్రతపై అవగాహన కల్పించారు. ఆర్టీవో ఆర్.సి.హెచ్.శ్రీనివాస్, వాహన తనిఖీదారులు మన్మోహన్, సహాయక ఎంవీఐ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

చెత్త కుప్పలతో అవస్థలు

సీతమ్మధార, జనవరి 22: నక్కవానిపాలెం, చైతన్యనగర్ ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో స్థానికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మద్దిలపాలెం నుంచి వెళ్లే నక్కవానిపాలెం, చైతన్యనగర్ ప్రాంతాల్లోని వినాయక, సాయిబాబా ఆలయాల వద్ద రహదారులపై చెత్త పేరుకుపోవడంతో భక్తులు అనేక అవస్థలు పడుతున్నారు. కొన్ని రోజుల కిందట గెడ్డలోని చెత్తను తొలగించి ఆలయం ఎదుట వేశారు. కానీ, ఇప్పటి వరకు దాన్ని పారిశుధ్య కార్మికులు తొలగించకపోవడంతో పలువురు మండిపడుతున్నారు. వెంటనే ఆ చెత్తను తొలగించి ఆలయ పరిసరాలను శుభ్రం చేయించాలని అధికారులను కోరుతున్నారు.


ఆలయం ఎదుట చెత్తకుప్ప

19,42,593
ఇదీ జిల్లాలో ఓటర్ల సంఖ్య

... 5వ పేజీ తరువాయి

సమయంలో విశాఖ పశ్చిమలో 2,34,917 నుంచి 2,06,943కు, దక్షిణలో 2,13,885 నుంచి 2,10,131కు, విశాఖ ఉత్తరంలో 2,74,646 నుంచి 2,74,114కు తగ్గారు.

ఇదిలావుండగా 2019 ఎన్నికల సమయంలో ఏడు అసెంబ్లీల పరిధిలో 18,81,674 మంది ఓటర్లు ఉండగా ...తాజాగా విడుదల చేసిన తుది జాబితాలో 19,42,593 ఉన్నారు. అప్పటితో పోల్చితే 60,919 మంది ఓటర్లు పెరిగారు. 2019లో గాజువాక నియోజకవర్గంలో 3,09,323 మంది, భీమిలిలో 3,05,958 మంది ఉండగా...ఇప్పుడు గాజువాక (3,23,671) సెగ్మెంట్‌ను భీమిలి (3,51,462) దాటేసింది. గడచిన ఐదేళ్లలో భీమిలిలో 45,304 మంది, గాజువాకలో 14,348 మంది, పెందుర్తిలో 30,571 మంది ఓటర్లు పెరిగారు.

అంగన్‌వాడీల తొలగింపు!

... 5వ పేజీ తరువాయి

వెళ్లేందుకు జిల్లా నుంచి వందలాది మంది బయలుదేరగా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. కొంతమందిని గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ నేపథ్యంలో సమ్మెలో ఉన్న వారిని విధుల్లో నుంచి తొలగించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు సమ్మెలో ఉన్న 1,343 మందిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో 696 మంది వర్కర్లు, 647 మంది హెల్పర్లు ఉన్నారు. విధుల్లో చేరిన 69 మంది వర్కర్లు, 50 మంది హెల్పర్లకు మినహాయింపు ఇచ్చారు. టెర్మినేషన్ ఉత్తర్వులను సదరు సిబ్బందికి అందించే బాధ్యతను ప్రభుత్వం రెవెన్యూ శాఖకు అప్పగించింది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు అందించిన తొలగింపు లేఖలను రెవెన్యూ సిబ్బంది ఇళ్లకు, వారు పనిచేసే కేంద్రాలకు అంటిస్తున్నారు. దీనిపై ఐసీడీఎస్ అధికారులను వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాలతో సిబ్బందిని విధుల నుంచి తొలగించామని, రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసి కొత్తవారిని తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వాన్ని టెర్మినేట్ చేస్తున్నాం..సమ్మె కొనసాగిస్తాం..

ప్రభుత్వ నిర్ణయాన్ని అంగన్‌వాడీ ఉద్యోగ సంఘ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ తరహా చర్యలతో భయపెట్టలేరని, తమ సమ్మె కొనసాగుతుందని స్పష్టంచేస్తున్నారు. విధుల నుంచి తమను ప్రభుత్వం టెర్మినేట్ చేయడం కాదని, తామే ప్రభుత్వాన్ని టెర్మినేట్ చేస్తున్నామని ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షురాలు తులసి పేర్కొన్నారు. సమ్మె యథావిధిగా కొనసాగుతుందని, ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు సమ్మెలోనే ఉంటామన్నారు. గడిచిన కొద్దిరోజుల నుంచి చేస్తున్నట్టుగానే జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం నుంచి సమ్మెలో ఉంటామని స్పష్టం చేశారు. అరెస్టులు, ఒత్తిళ్లతో భయపెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని, ఈ తరహా చర్యలు మంచివి కాదన్నారు.

నో టెండర్

... 5వ పేజీ తరువాయి

కొంత శాతం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ శాతం ఎవరు ఎక్కువ ఇస్తామంటే వారికే ప్రాజెక్టు ఇస్తారు. 33 ఏళ్ల తరువాత ఉన్నది ఉన్నట్టుగా వదిలేసి వెళ్లిపోవాలి.

ప్రభుత్వం పన్నుల ఆదాయం కోసం ప్రతి ఏటా భూముల విలువలు పెంచుకుంటూ పోతోంది. సాధారణంగా ఎక్కడ స్థిరాస్తి లావాదేవీలు జరిగితే అక్కడే విలువలు పెంచేవారు. వైసీపీ ప్రభుత్వం అలా కాకుండా ఏటా కొంత పెంచుకుంటూ పోతోంది. ఈ లెక్కన ఆ ఏరియాలో ఏటా మారే ప్రభుత్వ విలువ ప్రకారం అద్దె కూడా పెరుగుతుంది. ఈ లెక్కలన్నీ వేసుకున్న కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. గత నెల 14 నుంచి 28వ తేదీ వరకు టెండర్లకు సమయం ఇచ్చారు. ఒక్కరు కూడా రాకపోవడంతో మళ్లీ ఇప్పుడు జనవరి 21న నోటిఫికేషన్ ఇచ్చారు. ఫిబ్రవరి మూడో తేదీ వరకు గడువు ఇచ్చారు.

బస చేసేందుకు వసతి కూడా ఇవ్వాలని ప్రతిపాదన

అక్కడికి వినోదం కోసం వచ్చేవారు...రాత్రికి బస చేయడానికి కూడా ఏర్పాట్లు ఉంటే బాగుంటుందని, అలాగైతే తాము టెండర్లు వేస్తామని ఒకరిద్దరు ముందుకు వచ్చినట్టు తెలిసింది. మొత్తం ఏరియాలో 5 శాతం అందుకు ఉపయోగించుకుంటే ఫరవాలేదని, అలా కాకుండా హోటల్ కమ్ లాడ్జిలా అయితే మొత్తం కాన్సెప్ట్ దెబ్బతింటుందని అధికారులు సూచించారు. ఇప్పుడు ఆ విధంగా ఎవరు ఆసక్తి చూపుతారో చూడాలి.

లోకేశ్‌కు గండి బాబ్జీ జన్మదిన శుభాకాంక్షలు


హైదరాబాద్‌లో లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాబ్జీ

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 40వ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఆయన స్వగృహంలో టీడీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించారు.

నేడు సామాజిక సమతా సంకల్ప యాత్ర

సీతంపేట, జనవరి 22: విజయవాడ వేదికగా వేదికగా జరిగిన 125 అడగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయం మహా శిల్పం ఆవిష్కరణ ఘట్టాన్ని పురస్కరించుకొని జిల్లాలో మంగళవారం నిర్వహించనున్న సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పిలుపునిచ్చారు. ఆయన వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులతో వెబ్ ఎక్స్ ద్వారా మాట్లాడారు. మంగళవారం ఉదయం 9.45 గంటలకు రామాటాకీస్ కూడలి వద్ద జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది మానవహారం ఉంటుందన్నారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ, భవన్‌లో ఛాయాచిత్ర ప్రదర్శన, జిల్లా స్థాయి సెమినార్ ఉంటుందని తెలిపారు.

వెంకటేశ్వరమెట్ట సమస్యకు త్వరలో పరిష్కారం: ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం, జనవరి 22: జీవీ ఎంసీ 33వవార్డు వెంకటేశ్వరమెట్టలో దశాబ్దాలుగా ఉన్న నివాసితుల సమస్య కు త్వరలోనే పరిష్కారం లభించనున్నట్టు ఎమ్మెల్యే వా సుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. ఈనెల 30న జరగునున్న రా ష్ట్ర మంత్రి మండలిలో ఈసమస్య చర్చకు రానుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న నివాసితులకు గత ప్రభుత్వాల హ యాంలో ఎప్పుడూ న్యాయం జరగలేదని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వారికి అండగా ఉంటూ సమస్యపరిష్కారానికి ముందుకు వచ్చిందని అన్నారు.ఈ సమస్యపై అమరావతిలోఅడిషనల్ సెక్రటరీ రేవు ము త్యాలరాజు, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సాయి ప్రసాద్‌లకు వినతి పత్రాలిచ్చినట్టు ఆయన చెప్పారు.

'జగనన్నకు చెబుదాం'కు 156 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట, జనవరి 22: జగనన్నకు చెబుదాం కార్య క్రమానికి వచ్చిన వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వ నాథన్ అధికారులకు సూచించారు. సోమ వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్ర మంలో వినతుల ను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి 156 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 38, జీవీఎంసీకి 41, పోలీసు శాఖ సంబంధించి 7, ఇతర విభాలకు చెందిన 70 వినతులు స్వీకరించారు. నిర్ణీత వ్యవధిలో ఈ అర్జీలకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు జేసీ ఆదేశించారు. డీఆర్‌వో మోహనకుమార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

గోపాలపట్నం, జనవరి 22: గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయి రవాణా జరుగుతుందనే సమాచారంపై స్థానిక శ్మశాన వాటిక కూడలిలో మాటువేసిన పోలీసులు నెల్లూరుకు చెందిన ఎస్.నవీన్, పి.సురేశ్ వ్యక్తులకు చెందిన బ్యాగులు సోదాచేశారు. వారి వద్ద సుమారు 7 ఏడు కిలోల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన గోపాలపట్నం పోలీసులు నిందితులరె అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

4న జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

డాబాగార్డెన్స్, జనవరి 22: జాతీయ 14వ బాడీ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర జట్లను ఫిబ్రవరి 4న ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని రామాటాకీస్ ఎదురుగా వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో ఎంపిక చేయనున్నట్టు ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్ తెలిపారు. పురుషుల విభాగంలో 55 కేజీల నుంచి 100 కేజీల వరకు 10 గ్రూపుల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. 40 , 45, 50, 60, 65 వయసుల వారికి మాస్టర్ విభాగంలో సెలక్షన్ ఉంటుందన్నారు. ఎంపికైన పోటీదారులు మార్చి 1, 2 తేదీల్లో బీహార్ రాజధాని పాట్నాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుగా పాల్గొంటారని తెలిపారు.విశాఖతోపాటు ఇతర జిల్లాలకు చెందిన వారు ఈ ఎంపికలో పాల్గొనేందుకు వీలుగా ముందుగా పుల్లప్స్, డీప్స్ వీడియోస్‌పంపాల్సి ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్: 88852 03519లో సంప్రదించాలన్నారు.

జగన్ పాలనపై షర్మిల ఇంతకాలానికి స్పందిస్తారా?

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ధ్వజం


సమావేశంలో మాట్లాడుతూన్న మహ్మద్ నజీర్

మహారాణిపేట, జనవరి 22: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ కోణంలోనివా? లేదా జగన్‌తో లాలూచీ రాజకీయాలు చేయాలని అనుకుంటు న్నారా..? అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ప్రశ్నించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 57 నెలలుగా జగన్ పాలనపై తమపార్టీ పోరాటం చేస్తోందని, జగన్ దారుణాలపై షర్మిల ఇంత కాలానికి స్పందించకపోవడమేమిటని ఆయన నిలదీశారు. రాష్ట్రంలో మైనారిటీల ఊచకోతకు జగన్ పాల్పడితే ఆమె ఎందుకు ఇప్పటివరకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మరోసారి ప్రజలను మోసగించేందుకు షర్మిల ఎన్నికల ముందు వచ్చారన్నారు. ప్రజలు ఈ అన్నాచెల్లెలిని నమ్మేంత అమాయకులు కాదన్నారు. ఎన్ని కుట్రలతో రాజకీయాలు చేసినా వారిని విశ్వసించడంలేదన్నారు. మరోవైపు వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి లేదు, ప్రజాస్వామ్యం మచ్చుకైనా కానరావడంలేదు.. నిరుద్యోగులు ఉద్యోగాలు లేక సతమవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా, మహ్మద్ జఫ్రుల్లా , మహ్మద్‌గౌస్, ఖాలీషా పాల్గొన్నారు.

లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ.లక్ష విరాళం

సీతమ్మధార, జనవరి 22: లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ ఆసుపత్రి సేవలు అద్భుతమని ఆంధ్రా యూనివర్శిటీ ఎకనామిక్స్ విభాగం పూర్వ ఆచార్యులు బి.ప్రసాదరావు పేర్కొన్నారు. సీతమ్మధారలోని ఈ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ వి.ఉమామహేశ్వరరావును ఆయన సోమవారం కలిసి ఆసుపత్రిలో మెరుగైనసేవలు కల్పనకు వీలుగా రూ.లక్ష విరాళంగా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోనే లయన్స్ ఆసుపత్రికి గుర్తింపు ఉందన్నారు.


చెక్కు అందచేస్తున్న ప్రొఫెసర్ ప్రసాదరావు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివి..

సీతమ్మధార, జనవరి 22: ఆశీల్‌మెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో విద్యుత్ ఫీడర్ మరమ్మత్తులు నిర్వహిస్తున్నందున మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్ 1 ట్రాన్స్‌కో ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సీతమ్మధార అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంతం, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, ఆర్ అండ్‌బీ క్వార్టర్స్, ఎఎస్ఆర్ స్టాట్యూ, క్షత్రియ కళ్యాణమండపం పరిసరాలు, నారాయణ స్కూల్ ప్రాంతం, ఎఎస్ఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా పోలమాంబ తొలేళ్ల సంబరాలు

జగదాంబ కూడలి, జనవరి 22: జీవీఎంసీ 30వ వార్డు కుమ్మరవీధి పోలమాంబ 66వ పరస ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలేళ్ల పురస్కరించుకుని అమ్మవారిని పసుపు రాసి, చీర, ఆభరణాలతో అలంకరించారు. ఉదయం 7 గంటల సమయంలతో మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉన్న పోలమ్మను దర్శించుకొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తమ కోర్కెలు తీర్చాలంటూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన పసుపును ముద్దగా చేసి విగ్రహానికి పూతగావేశారు. సాయంత్రం ఆలయం నుంచి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి జలంతో మహిళలు అభిషేకం జరిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తుతో పర్యవేక్షించారు. పురువీధులు విద్యుత్ దీపకాంతులతో ప్రకాశించాయి. రాత్రి ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పురప్రజలను అలరించాయి.


పసుపు అద్దకంలో అమ్మవారు

జీవీఎంసీపై సిటీ పోలీసుల విజయం

విశాఖపట్నం (స్పోర్ట్స్), జనవరి 22: జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న వార్షిక ఇనిస్టిట్యూషన్ లీగ్ టోర్నీలో భాగంగా సోమవారం జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో సిటీ పోలీసు ఆరు వికెట్ల తేడాతో జీవీఎంసీపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జీవీఎంసీ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 143 పరుగులు చేసింది. జి.నరేష్‌కుమార్ (37), ఏ సునంద్ (38) రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సిటీ పోలీసు 18.2 ఓవర్లలో నాలుగు వికెట్లకు 146 పరుగులతో లక్ష్యాన్ని సునాయాసంగా చేధించి ఫైనల్స్‌కు ప్రవేశించింది. సిటీ పోలీసు జట్టులో ఎం.సంతోష్ (42), వి.త్రినాద్ (27), వి.గోపీకృష్ణ (26) రాణించి జట్టుకువిజయాన్నందించారు.

విద్యార్థులకు ల్యాబ్‌ట్యాబ్‌లు పంపిణీ

సీతమ్మధార, జనవరి 22: సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని జీవీఎంసీ ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న 214 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ చేతులమీదుగా బైజూస్ లాబ్ ట్యాబ్స్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ట్యాబ్‌లు అందిస్తున్న హెచ్‌ఎం రామ్ ప్రసాద్

మాధవధార;మాధవధార జీవీఎంసీ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు సోమవారం ల్యాబ్‌ట్యాబ్‌లను అందించారు. హెచ్‌ఎం బి.హేమలత అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నార్త్ ఇన్‌చార్జి కె.కె.రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని వీటిని అందించారు. బాలలు ట్యాబ్‌ల సాంకేతిక సాయంతో చదువుల్లో మరింత ప్రగతి సాధించాలని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటరు వి.ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జనవరి 22 : మిథిలాపురి వుడాకాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పోర్ట్ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, సుద్దగెడ్డ, వాంబే కాలనీ, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆనందపురంలో...

ఆనందపురం : మండలంలోని గిడిజాల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో లైన్ల మరమ్మతు దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు.గుమ్మడివానిపాలెం, శొంఠ్యాం, గిడిజాల, వేమగొట్టిపాలెం, ముచ్చర్ల, తంగుడుబిల్లి, దిబ్బడిపాలెం,మిందివానిపాలెం, ఈగలవానిపాలెం, దుక్కవానిపాలెం, తర్లువాడ, గుడిలోవ, పాలవలస గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలన్నారు.

ఘనంగా సాయి ఆలయ వార్షికోత్సవం

వెంకోజీపాలెం, జనవరి 22 : పాతవెంకోజీపాలెంలోని సీతా రామాలయంలో వేంచేసి ఉన్న దత్తాత్రేయ, సరస్వతి, సాయినాథుల ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ముందుగా సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో 108 కళశాలతో బాబాకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు రంపా రామ్మోహన్‌శర్మ, రంపా మురళి భక్తులతో పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్న వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘం గౌరవ అధ్యక్షుడు బొడ్డేటి సూర్యనారాయణ, అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు వెలగా వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కొళ్ల అప్పలరాజు, కార్యదర్శి ఆడారి శివప్రకాష్, కోశాధికారి శరగడం సుధాకర్, సహాయ కార్యదర్శులు రాజగిరి సురేష్, ఆడారి రమణ, కర్రి రఘు పాల్గొన్నారు. కాగా సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పరస జరగనున్నట్టు సంఘం అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం తెలిపారు.

స్పందనకు మూడు వినతులు

భీమునిపట్నం, జనవరి 22 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మూడు అర్జీలు అందాయని జడ్సీ బొడ్డేపల్లి రాము తెలిపారు. పట్టణ ప్రణాళికా విభాగానికి, ఇంజనీరింగ్ విభాగానికి, ప్రజారోగ్య విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు.

ఆశీలు వసూలుకు వేలం రేపు

భీమునిపట్నం, జనవరి 22 : పట్టణంలోని మెయిన్ రోడ్ మార్జిన్, లాల్‌బహదూర్‌శాస్త్రి మార్కెట్, కలిగొట్ల సూర్యనారాయణనాయుడు మార్కెట్, తగరపువలస, చిట్టివలసలోని రోడ్డు మార్జిన్‌లను రోజువారీ ఆశీలు వసూలుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు జోనల్ కమిషనరు రాము తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు కాలపరిమితికి భీమిలి రోడ్ మార్జిన్‌కు రూ. 6 లక్షలు, తగరపువలస ఏరియా రోడ్ మార్జిన్‌కు రూ. 7 లక్షలు ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో వేలం పాట జరుగుతుందని చెప్పారు.

'రాష్ట్రంలో సంక్షేమ పాలన'

ఎండాడ, జనవరి 22 : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్నారని వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంతెన మాధవీ వర్మ అన్నారు. ఎండాడలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబుకు ప్రయోజనాల కోసమే షర్మిల మాట్లాడుతుందని, ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితమైందని తెలిపారు. రాష్ట్రంలో అడుగుపెట్టిన వెంటనే షర్మిల అభివృద్ధి కోసం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

బడి బయట విద్యార్థులకు దివీస్ ఆర్థిక సాయం

భీమునిపట్నం (రూరల్), జనవరి 22 :టెన్త్, ఇంటర్ మధ్యలో మానేసిన 33 మంది విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ద్వారా చదివించడానికి దివీస్ కంపెనీ ఆర్థిక సాయం అందించింది. ఈమేరకు సోమవారం పదో తరగతికి 15 మంది, ఇంటర్ 18 మంది విద్యార్థులకు రూ. 90 వేలు ఫీజు చెల్లించింది. అలాగే స్టడీ మెటీరియల్ కూడా అందించారు.

సినిమా గైడ్

● **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి),

● **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)

● **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 20, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 44, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 18, క్యారెట్ 28, దొండకాయలు 22, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 110, బరబటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 44, దోస కాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30 , కంద 54, దేముడు చిక్కుడు 34, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	563
విజయనగరం	567
శ్రీకాకుళం	567

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 90
ఫారం ధర	-- 110
విత్ స్కిన్	-- 190
స్కిన్‌లెస్	-- 200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



ఇసుకతోటలో సీతా రాముల కల్యాణం



మద్దిలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు



భీమిలిలో శ్రీరామ శోభాయాత్ర

శ్రీరామ నామం..పులకించిన భక్త జనం

▸▸ తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు

▸▸ పలుచోట్ల వైభవంగా శోభాయాత్ర

భీమునిపట్నం, జనవరి 22 :పట్టణంలో శ్రీరామ శోభాయాత్ర సోమవారం వైభవంగా నిర్వహించారు. పాత బస్టాండ్ సమీపంలో వున్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పట్టణంలోని అన్ని రామాలయాలను కలుపుతూ సాగింది. సుభాష్ రోడ్‌లో వున్న శ్రీ వీరమట్టి శ్రీరామ మందిరం వద్దకు యాత్ర చేరగా అక్కడ ప్రసాద వితరణ చేపట్టారు. సన్ స్కూల్ విద్యార్థుల కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పట్టణ అర్చకులు రొంపిచెర్ల సింగరాచార్యులు, పట్టణ పురోహితులు సుసరాపు కామేశ్వర మాధవశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు. అలాగే బోయవీధి రామాలయంలో జాలర్ల సంఘం ఆధ్వర్యంలోనూ, బీచ్‌రోడ్ చుక్కవానిపాలెం శ్రీరామ మందిరంలో 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు ఆధ్వర్యంలోనూ ప్రత్యేక పూజలు, బైటో భజన చేశారు.

ఆలయాల్లో రామ నామ సంకీర్తనలు

మధురవాడ : మధురవాడ పరిసరాల్లోని పలు ఆలయాల్లో రామనామ సంకీర్తనలు నిర్వహించారు. ఏడో వార్డు పరిధిలోని మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలిత త్రిపుర సుందరీదేవి సమేత మహాకామేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రామ నామ సంకీర్తనలు చేశారు. మల్లయ్యపాలెం రామాలయం, మిథిలాపురి వుడా కాలనీలోని ఆలయంలో రాముడికి పూజలు నిర్వహించారు.

ఘనంగా శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ లోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీరామ పాదుకా పట్టాభిషేకం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల కోసం రామాయణం, భారతం,భాగవతం వంటి గ్రంథాలను ప్రదర్శనగా ఉంచారు. వైదిక విజ్ఞాన విపంచి బృందం హనుమాన్ చాలీసా, శ్రీరామ భక్తిగీతాలాపన నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలోని ధర్మ ప్రచార పరిషత్, విశాఖ జిల్లా ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంయుక్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహించాయి.17వ వార్డు ఆదర్శనగర్‌లో మహిళలు గ్రామమంతా తిరిగి జై శ్రీరామ్ నినాదాలు చేశారు. ఆరిలోవ సూర్యతేజనగర్‌లో స్థానిక పోలమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహించి, ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

జై శ్రీరామ్ ఆకృతిలో విద్యార్థులు

ఆనందపురం : గుడిలోవ విజ్ఞాన విహార ఆశ్రమ పాఠశాల ఆవరణతో అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సరస్వతీ విద్యా విహార్ విద్యార్థులు జై శ్రీరామ్ ఆకృతిలో ఏర్పడి ఆహుతులను ఆకట్టుకున్నారు. అలాగే చందక, పొడుగుపాలెం, గిడిజాల, గండిగుండం, రామవరం, శొంఠ్యాం, తర్లువాడ, వెల్లంకి, పెద్దిపాలెం గ్రామాల్లోని రామాలయాల్లో పూజలు జరిపారు.



జై శ్రీరామ్ ఆకృతిలో సరస్వతి విద్యావిహార్ విద్యార్థులు

కళాభారతిలో..

మద్దిలపాలెం : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యం లో సీతారాములకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సహస్రనామార్చన, సంకీర్తన, హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణం, భజనలు జరిపారు. దీపారాధన చేసి రాముల వారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, గుమ్ములూరి రాంబాబు, తదిత రులు పాల్గొన్నారు. అలాగే పిఠాపురం కాలనీలోని భద్రచల రామయ్య ఆలయంలో అయోధ్య వేడుకలను తెరపై ప్రత్యక్ష ప్రచారంలో చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. మద్దిలపాలెంలోని దేవిహోమ్స్‌లో శ్రీరామునికి ఘనంగా పూజలు నిర్వహించారు. అపార్ట్‌మెంట్ వాసులు ముగ్గులతో శ్రీరాముడ్ని అలంకరించి వేడుకలు జరిపారు.

రామాలయంలో బైటో భజన

తగరపువలస : జీరుపేట రామాలయంలో బైటో భజన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమం జరిగింది. అలాగే భీమిలి రూరల్ మండలం చిప్పాడలో సుత్తమ్మతల్లి సేవా పీఠం ఆధ్వర్యంలో పది గ్రామాలకు చెందిన యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కృష్ణంరాజుపేటలో జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు ఆధ్వర్యంలో రామాలయంలో పూజలు జరిపి, శోభాయాత్ర నిర్వహించారు.

హనుమాన్ చాలీసా

సిరిపురం : ఆర్కే బీచ్ సబ్‌మెరైన్ ఎదురుగా ఉన్న అన్నమయ్య ప్రాంగణంలో సుమారు 500 మంది మహిళలు హనుమాన్ చాలీసా నిర్వహించారు. పారాయణం, సుందరకాండ పారాయణం, కోలాటాలు, రామ నామ సంకీర్తనలతో సాగర తీరాన్ని హోరెత్తించారు. తాళ్లపాక అన్నమాచార్య వంశీయుల ఆధ్వర్యంలో నడిచే శ్రీ వెంకట అన్నమాచార్య సేవ ట్రస్ట్ డైరెక్టర్ సునీత కొఠారి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంధి రాజేష్, అభిరుచి ఫుడ్స్ రామకృష్ణ, సౌభాగ్య మ్యాచింగ్ ట్రస్ట్ ప్రతినిధులు గాయత్రి దంపతులు,మురళి, తిలక్, నాగలక్ష్మి, లక్ష్మి, సురేష్, సూర్యకుమారి, పాల్గొన్నారు.

శ్రీరామదాసు సంకీర్తనలు

బీచ్ రోడ్డు :బీచ్‌రోడ్డులోని రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక సంగీత సేవా సంస్థ మనోరంజని వ్యవస్థాపకురాలు జి.శారద శిష్య బృందం శ్రీరామదాసు కీర్తనలు మధురంగా ఆలపించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రాజశేఖర్ వ్యవహరించగా వయోలిన్‌పై శ్రీనివాస్, మృదంగంపై సందీప్ సంగీత సహకారం అందించారు.

సాగర్‌నగర్‌లో...

సాగర్‌నగర్ : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శోభాయాత్ర జరిగింది. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయిసేవని శ్రీరామ లీలపై ప్రవచనాలు చేశారు. సాయంత్రం దీపోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. సాగర్‌నగర్ సాగరేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

సింహాచలంలో...

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులో సింహాద్రి మఠం వ్యవస్థాపకుడు కసిరెడ్డి సురేంద్రబాబు, వీహెచ్‌పీ నేత పూడిపెద్ది శర్మ సారథ్యంలో పుర పరిక్రమణ నిర్వహించారు. వార్డులోని ప్రధాన ప్రాంతాల్లో రామ నామ సంకీర్తనలు ఆలపిస్తూ వాడవాడలా పరిక్రమణ చేశారు. అలాగే అయోధ్య రాముడి అక్షితలను ప్రతి ఇంటికి అందజేశారు. విజినిగిరిపాలెంలోని ఉమా చంద్ర మౌళేశ్వరాలయంలో, సీతారామస్వామి దేవాలయంలో, పాత అడివివరంలో, సింహపురి కాలనీలో, గోశాలలోని సింహగిరి నిర్వాసితుల కాలనీలో భక్తులు హనుమాన్ జెండాలు పట్టుకుని భజనలు చేస్తూ వీధుల్లో తిరిగారు.

పద్మనాభంలో...

పద్మనాభం/రూరల్ : మండలంలోని రేవిడి, పాండ్రంగి, బొత్సపేట, కోరాడ, రెడ్డిపల్లి, కృష్ణాపురం, ఎస్సీ కాలనీ, అయినాడ, బీఆర్ తాళ్లవలస, మద్ది, పొట్నూరు, విలాస్‌ఖాన్‌పాలెంగ్రామాల్లో ప్రత్యేక పూజలునిర్వహించారు.మద్దిలో సీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను పల్లకీపై ఊరేగించి, శోభాయాత్ర చేశారు. పద్మనాభంలోని కుంతీమాధవస్వామి ఆలయం నుంచి భక్తులు వీధుల్లో తిరుగుతూ నామ సంకీర్తన చేశారు.

పీఎంపాలెంలో...

కొమ్మాది : పీఎంపాలెం రామాలయంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి కుటుంబ సమేతంగా పూజలు జరిపారు. చంద్రంపాలెం జాతర గుట్ట దుర్గాలమ్మ ఆల యంలో సీతారాముల విగ్రహాలకు శోభాయాత్ర నిర్వహించారు. మధురవాడ అడ్రస్ అపార్టుమెంట్‌లో శ్రీరా మచంద్ర మూర్తి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి సామూహిక పూజలు చేపట్టారు.

ఇసుకతోట రామాలయంలో...

వెంకోజీపాలెం :ఇసుకతోట రామాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మేడపాటి దంపతులు సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

16వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి

వెంకోజీపాలెం, జనవరి 22 : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు ఇసుకతోటలో టీడీపీ నాయకులు సోమవారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు నారు గోపి, ముగడ వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని ఇంటింటికి వెళ్లి టీడీపీ అమలు చేయనున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు షేక్ మదర్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బుగత సత్యనారాయణ, పల్లా ఉమారాణి, బంగారు రాజు, మొల్లి శంకర్, మళ్ల రవికుమార్, జి. అప్పన్న, ఆర్. నూకరాజు, జనసేన అధ్యక్షుడు సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఏయూ విద్యార్థులు

వెంకోజీపాలెం, జనవరి 22 : ఏయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన 27వ జాతీయ యువజన ఉత్సవంలో పాల్గొన్నారు. వారిని వీసీ ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఏయూ పరిధిలోని ఆరుగురు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఒక ప్రోగ్రాం అధికారి ఈనెల 12 నుంచి 16 వరకు జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్. హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వీసీ ప్రసాదరెడ్డికి అభినందనలు

వెంకోజీపాలెం, జనవరి 22 : ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డిని శ్రీకాకుళంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కేఆర్ రజని అభినందించారు. అనంతరం ఆచార్య రజనిని ఏయూ తరపున వీసీ ప్రసాదరెడ్డి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రసాదరెడ్డి పలువురు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. డీసీపీలు ఆనంద్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఏసీపీ మూర్తి, మూడో పట్టణ సీసీ కోరాడ రాజబాబు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కొమ్మాది, జనవరి 22 : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈఓ చంద్రకళ అన్నారు. సోమవారం ఆమె చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 900 మంది టెన్త్ విద్యార్థులకు రూ. 1.88 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ కంపెనీ సీఎస్ఆర్ మేనేజర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న డీఈఓ చంద్రకళ

చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం

- టీడీపీ భీమిలి అసెంబ్లీ ఇన్‌చార్జి రాజబాబు



సదస్సులో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

పద్మనాభం, జనవరి 22 : బలహీన వర్గాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. పద్మనాభంలో సోమవారం జరిగిన మండల స్థాయి జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు అనేక రకాల సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా వారి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు టీడీపీ సముచిత స్థానం ఇస్తోందన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం బీసీలను నమ్మించి మోసం చేసిందన్నారు. బీసీ కులాల కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చిందన్నారు. నాలుగున్నరేళ్లుగా బీసీలకు ఎటువంటి వ్యక్తిగత రుణాలు, పథకాలు అమలు చేయలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టాలని బీసీలకు పిలుపునిచ్చారు. సదస్సులో టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి నూకరాజు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, జనవరి 22 : మండలంలోని ప్రజలకు న్యాయపరమైన సలహాలతో పాటు న్యాయ సహాయం చేయాలన్న ఆలోచన వున్నవారు పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి తెలిపారు. ఈమేరకు భీమిలి కోర్టు మెజిస్ట్రేట్, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 28 లోగా ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు అందించవచ్చు.ఆధార్ కార్డు,విద్యార్హత పత్రాలు, పాస్ పోర్టు సైజు, స్టాంప్ సైజ్ ఫొటోతో పాటు పాటు భీమిలి ప్రిన్సిపాల్ జూనియరు సివిల్ జడ్జి కోర్టులో వున్న మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. కనీస విద్యార్హత పదవ తరగతి అని, ఎంపికైన వారికి ఎటువంటి జీతం, పారితోషికం వుండదని చెప్పారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు : ఎంపీ ఎంవీవీ

విశాలాక్షినగర్, జనవరి 22 : అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఇళ్ల పట్టాలిస్తామని ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన 9వ వార్డు విశాలాక్షినగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం అర్హులకు జీవో నెంబర్ 388కి సంబంధించిన పట్టాలతో పాటు సెంటు స్థలం పట్టాలను అందజేశారు.



లబ్ధిదారుకి ఇంటి పట్టా అందిస్తున్న ఎంపీ సత్యనారాయణ



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

25న ఆరిలోవలో జయహో బీసీ సభ

ఎంవీపీ కాలనీ, జనవరి 22 : ఆరిలోవలో ఈనెల 25న జరగనున్న జయహో బీసీ సభను టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ కార్పొరేటరు ఒమ్మి సన్యాసిరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన 11వ వార్డు తోటగరవులోని పార్టీ కార్యాలయంలో 9,10,11,12,13 వార్డుల అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటగరవు ఎర్నిదుర్గమాంబ కల్యాణ మండపంలో జరిగే జయహో బీసీ సభకు నగరంలోని ముఖ్య నాయకులతో పాటు రాష్ట్రస్థాయి నాయకులు హాజరుకానున్నట్టు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మూది అప్పారావు, కృష్ణంరాజు, ఒమ్మి పోలరావు, మద్దెల రాజశేఖర్, గాడి సత్యం, యల్లమిల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఉచిత వసతి సౌకర్యం

సింహాచలం, జనవరి 22 : సింహగిరికి వస్తున్న భక్తులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. పాలక మండలి చైర్మన్ సింహగిరి చుట్టూ 50 కల్యాణ మండపాలు నిర్మించాలని, నామమాత్రపు అద్దెతో వివాహాది శుభకార్యాలు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈమేరకు మూడేళ్ల క్రితం సింహాచలం ఆర్‌టీసీ కాంప్లెక్స్‌కు ఆనుకుని ప్రధాన మార్గంలో నాలుగు మండపాలను మొదటి అంతస్తు గ్రౌండ్ ఫ్లోర్‌లో దుకాణ సముదాయాన్ని నిర్మించారు. ప్రస్తుతం పైఅంతస్తులో ఒక మండపంలో దేవస్థానం ఆగమ పాఠశాలలో నాదస్వరం, డోలు విద్యార్థుల వసతికి కేటాయించారు.మిగిలిన మూడు మండపాలను భక్తులకు ఉచిత వసతికి ఇవ్వాలని నిర్ణయించి బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే వసతి సౌకర్యం ఎక్కడ ఉందన్న విషయం తెలియక చాలా మంది నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఈ విషయమై ఈఓ వద్ద ప్రస్తావించగా భక్తులకు ఉచిత వసతి కల్పించేందుకు వీలుగా ఒక ఉద్యోగిని నియమిస్తున్నట్టు చెప్పారు.

వైసీపీ పాలన అంతమే లక్ష్యం : వంశీకృష్ణ



జనసేన పార్టీలో చేరిన మహిళలతో వంశీకృష్ణ శ్రీనివాస్

మద్దిలపాలెం, జనవరి 22 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా జన సైనికులు పని చేయాలని ఆ పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన శివాజీపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన పలువురు మహిళలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి అక్రమాలే జరిగాయన్నారు. వాటిని కప్పిపుచ్చుకోవడానికి ఎమ్మెల్యే అభ్యర్థులు, సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానాలను మార్పు చేసి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరడంతోనే వైసీపీ పతనం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో వీర మహిళలు నక్క సావిత్రి, గొంప సత్యవతి, లక్ష్మి, మహాలక్ష్మి, మాధవి, మంగ లక్ష్మి, జ్యోతి, ఆదిలక్ష్మి, ధరణి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, జనవరి 22 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధన జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృ సింహ సహస్ర నామావళితో తులసీ దళార్చన చేశారు. అనంతర అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్యకల్యాణం కన్నుల పండువగా జరిపారు.

సంప్రదాయబద్ధంగా సంక్షిప్త రామాయణ హవనం

సింహాచలం, జనవరి 22 : సింహగిరిపై ఉన్న సీతారామస్వామి ఆలయంలో సంక్షిప్త రామాయణ హవనాన్ని సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు అనంతరం సుదర్శన పెరుమాళ్‌ను ప్రత్యేక వేదికపై ఉంచారు. శాస్త్ర విధానంలో మండప, బింబి, కలశారాధనలు జరిపారు. ముందుగా సిద్ధం చేసిన హోమకుండంలో అగ్ని ప్రతిష్టాపన చేసి పంచసూక్తాలతో, సంక్షిప్త రామాయణ పఠనాలతో ప్రత్యేక హవనాన్ని జరిపి పూర్ణాహుతి చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

పద్మనాభం (రూరల్), జనవరి 22 : ఓటర్ల తుది జాబితాను సోమవారం విడుదల చేసినట్టు తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ సచివాలయాల్లో తుది జాబితాను అందుబాటులో ఉంచామని చెప్పారు.

కుల గణన సర్వే పరిశీలన

పద్మనాభం (రూరల్), జనవరి 22 : మండలంలోని అనంతవరం, పెంట, కొవ్వాడ గ్రామాల్లో ఎంపీడీవో ప్రభాకరరావు సోమవారం కులగణన సర్వేను పరిశీలించారు. సర్వే వివరాలను కార్యదర్శి అప్పలరాజు, నాగమణిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయనతో పాటు సర్పంచులు వెంకటలక్ష్మి, పావని ఉన్నారు.

పలు గ్రామాల్లో 'వికసిత్ భారత్'

పద్మనాభం (రూరల్), జనవరి 22 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణుల చెంతకు తీసుకురావడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు అన్నారు. సోమవారం ఆయన అనంతవరం, పెంట, కొవ్వాడ, బాందేవుపురం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు ప్రసాదరావు, నాయకులు పేర్రాజు, కృష్ణారావు, అప్పలరమణ పాల్గొన్నారు.

నేషనల్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌కు రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, జనవరి 22 : ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ న్యూఢిల్లీలో జరుగుతున్న నేషనల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ ఆన్ కామర్స్ అండ్ అకౌంటెన్సీకు హాజరయ్యారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సంయుక్తంగా రెండు రోజుల పాటు ఈ సదస్సును న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థల నుంచి సీనియర్ విద్యావేత్తలను, పరిశోధకులను ఆహ్వానించారు. ఏయూ నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ హాజరయ్యారు.

రాష్ట్రస్థాయి పురస్కార గ్రహీతలకు అభినందనలు



పురస్కార గ్రహీతలను అభినందిస్తున్న వీసీ

వెంకోజీపాలెం, జనవరి 22 : ఏయూ పరిధిలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, వలంటీర్‌లకు రాష్ట్ర స్థాయి పురస్కారాలు లభించాయి. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, గైట్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల విద్యార్థిని డి. లక్ష్మీ శ్రీలేఖ రాష్ట్రస్థాయిలో అందించే అవార్డులకు ఎంపికయ్యారు. వారు ఈనెల 12న అవార్డులు తీసుకున్నారు. ఈమేరకు సోమవారం వీసీ ప్రసాదరెడ్డి వారిని తన కార్యాలయంలో అభినందించి సత్కరించారు.